తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : రఘ్వం నారరాజా
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
ఆదివారం
3 ఆగస్టు 2025
సంపుటి : 350
సంచిక : 2
పేజీలు : 8
వెల రూ.5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna



## నవభారత్ శత్రువులకు
# కాలభైరవుడు

- భారత దేశ శత్రువులు భూగర్భంలో కూడా బ్రతికి ఉండరాదు
- ఆపరేషన్ సిందూర్‌ను ఎవరైనా తమాషా అని పిలుస్తారా
- ఆపరేషన్ సింధూర్ సక్సెస్ వల్ల విపక్ష నేతలకు కడుపు నొప్పి
- విశ్వనాథుడి ఆశీర్వాదంతో ఆపరేషన్ సిందూర్ సక్సెస్ అయ్యింది
- మన సైనిక బలగాలను కాంగ్రెస్ నిత్యం అవమానిస్తోంది
- వారణాసిలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ

**వారణాసి**

ఆధునిక భారత దేశం శత్రుదేశాలకు కాలబైరవుడు అవుతాడని ప్రధాని మోదీ అన్నారు. తన స్వంత నియోజకవర్గం వారణాసిలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. భారత దేశ శత్రువులు భూగర్భంలో కూడా బ్రతికి ఉండరాదు అని అన్నారు. ఆపరేషన్ సింధూర్ సక్సెస్ గురించి ఆయన ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పార్టీ వైఖరిని విమర్శించారు. ఆపరేషన్ సింధూర్‌ను తమాషా అని పేర్కొన్న కాంగ్రెస్‌ను తప్పుపట్టారు. తాజాగా జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ ఎంపీ పరిణీతి షిండే ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌ను ఎవరైనా తమాషా అని పిలుస్తారా

-మిగతా 2 లో

## సామాజిక న్యాయం
# కాంగ్రెస్‌కే సాధ్యం

### దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన పార్టీ కాంగ్రెస్

- దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి
- రాహుల్‌ను ప్రధానిని చేస్తామని తెలంగాణ పక్షాన హామీ
- 75 ఏళ్ల నిబంధన పెట్టినా పదవి వదలని నేత మోడీ
- మోడీని గద్దెదించడం కేవలం రాహుల్‌కు మాత్రమే సాధ్యం
- కాంగ్రెస్ న్యాయ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి




**న్యూఢిల్లీ,**

దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న పార్టీ కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యమని అన్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అని.. భాజపా, భారత రాష్ట్ర సమితి, జేడీ, బీజేడీ, ఆర్‌జేడీ.. ఏ పార్టీ అయినా స్వాతంత్య్రం తర్వాతే వచ్చాయని తెలిపారు. ఇతర పార్టీలు ఎన్నికల్లో గెలిస్తే కుర్చీలో, ఓడితే ఇంట్లో కూర్చుంటాయి. ఎన్నికల్లో ఓడినా,గెలిచినా ప్రజల

-మిగతా 2 లో




# ట్రంప్ మాటలు...అబద్ధం

### ట్రంప్ చెంప ఛెళ్లుమనిపించిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్

- డెడ్ ఎకానమీ అంటూ చేసిన ప్రకటపై ఏఐ దిమ్మతిరిగే సమాధనం
- భారత్ ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తోందని జవాబు

**న్యూయార్క్,**

ప్రస్తుత సాంకేతిక యుగంలో ఓపెన్ ఏఐ, చాట్‌జీపీటీ వంటి వాటికి ప్రత్యేక ఆదరణ ఉంది. ఎలాంటి ప్రశ్నలకైనా ఈ కృత్రిమ మేధస్సు ప్లాట్‌ఫామ్‌లు సమాధానం చెబుతున్నాయి. తాజాగా ట్రంప్ భారత ఆర్థిక

-మిగతా 2 లో




# లోక్‌సభ ఎన్నికల్లో భారీ రిగ్గింగ్

- బీజేపీకి అనుకూలంగా ఎన్నికల సంఘం పనితీరు
- దాని ఆధారాలు తమవద్ద ఉన్నాయి
- తాము అధికారంలోకి వచ్చాక దేనినీ వదలం
- అధికారులు రిటైర్ అయినా పట్టుకుని శిక్షిస్తాం
- కాంగ్రెస్ న్యాయసమీక్ష సదస్సులో రాహుల్

**న్యూఢిల్లీ,**

మొన్నటిలోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, దానికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్షిక న్యాయ సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. భారత దేశంలో ఎన్నికల సంఘం న్యాయ సమ్మతంగా పనిచేయడం లేదని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలను రిగ్గింగ్ చేయవద్దు అని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని రాహుల్ తెలిపారు. ఆ రిగ్గింగ్‌కు చెందిన డేటా, డాక్యుమెంట్లు-

-మిగతా 2 లో

## బీసీ రిజర్వేషన్ల పేరుతో
# కాంగ్రెస్ డ్రామాలు

### 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి చూపాలి

- 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి చూపాలి
- కామారెడ్డి డిక్లరేషన్‌కు ఎందుకు కట్టుబడలేదు
- ముస్లిం రిజర్వేషన్లతో బీసీల కోటాకు గండి
- కేంద్రం, బీజేపీలపై నెపం నెట్టి తప్పించుకునే యత్నం
- ఎంతమంది బిసిలకు పదవులు కట్టబెట్టారో చెప్పాలి
- ఇందిరాపార్క్ వద్ద సభలో బీజేపీ నేతల డిమాండ్




**హైదరాబాద్,**

రిజర్వేషన్‌లు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం, బీజేపీపై బట్టకాల్చి మీద వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇది బీసీ రిజర్వేషన్ల కోసం కాదని.. ముస్లింలకు మేలు చేసేదని విమర్శించారు. గతంలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు. ఇందిరాపార్క్ వద్ద జరిగిన ధర్నాలో కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో వందరోజుల్లో

-మిగతా 2 లో

## కాళేశ్వరం కేసులో
# కేసీఆర్ పక్కా దోషి

- కమిషన్ విచారణలో అదే తేలింది
- సొంత లాభం కోసం లక్షకోట్లు వృధా చేసిన కేసీఆర్
- అందుకు మూల్యం చెల్లించక తప్పదు: పీసీసీ చీఫ్



**సంగారెడ్డి,**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. కేసీఆర్ దోషి అని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెప్పిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలు వృథా చేసి తెలంగాణను కేసీఆర్ అప్పులపాలు చేశారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తేల్చి చెప్పిందని అన్నారు. ఇంజనీర్లు చెప్పింది కేసీఆర్ వినకుండా తన సొంత లాభం మాత్రమే చూసుకున్నారని విమర్శించారు. పాదయాత్రలో భాగంగా శనివారం ఆందోలు మండలం సంగుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర

-మిగతా 2 లో

# ఆయన దగ్గర ఆటమ్ బాంబు ఉంటే పేల్చనివ్వండి'



- రాహుల్‌గాంధీపై రక్షణ మంత్రి సెటైర్

**న్యూఢిల్లీ,**

అధికార బీజేపీ కి మేలు చేసేలా కేంద్ర ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని, అందుకు సంబంధించి తన దగ్గర ఆటమ్ బాంబు లాంటి సాక్ష్యం ఉందని శుక్రవారం కాంగ్రెస్ ఎంపీ , లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కౌంటర్ ఇచ్చారు.రాహుల్‌గాంధీ దగ్గర ఆటమ్ బాంబు ఉంటే పేల్చనిద్దామని, కానీ ఆ పేలుడులో ఎలాంటి హాని జరగకుండా ఆయనను ఆయన కాపాడుకోవాలని రక్షణ మంత్రి ఎద్దేవా చేశారు. 'రాహుల్‌గాంధీ తన దగ్గర ఆటమ్ బాంబు ఉందంటున్నాడు. ఉంటే ఒకసారి ఆయన దాన్ని పేల్చాలి.

-మిగతా 2 లో

## బనకచర్లపై లోకేశ్‌వి
# అవగాహన లేని మాటలు



- మిగులు జలాల గురించి అప్పుడే ఎలా తేలుస్తారు
- కేటీఆర్‌తో రహస్య భేటీ తరవాతనే తెరపైకి బనకచర్ల
- డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క సంచలన వ్యాఖ్యలు

**కొల్లాపూర్,**

బనకచర్లపై లోకేశ్ తదితర మంత్రుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కమండిపడ్డారు. అసలు జలాలకే మోక్షం లేదంటే ఇక మిగులు జలాలు ఎక్కడివని అన్నారు. తెలంగాణ వినియోగించుకోగా వచ్చిన నీళ్లు వాడుకుంటామని అంటున్నారని, అది ఇప్పట్లో సాధ్యం కాదన్నారు. పోలవరం లాంటి ప్రాజెక్టును పూర్తి చేయలేక పోతున్నారని అంటూ..ముందు దాని సంగతి చూడాలన్నారు.

-మిగతా 2 లో

# 50 ట్రిప్స్.. జీరో రిజల్ట్స్..!



### సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటనలపై కేటీఆర్ సెటైర్లు

**హైదరాబాద్**

హస్తిన యాత్రలో సీఎం రేవంత్ రెడ్డి అర్ధ శతకం సాధించారు.. 50 ట్రిప్స్.. జీరో రిజల్ట్స్ అని పేర్కొంటూ సీఎంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లు వేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఫైల్స్‌తో కాకుండా ఫ్లైట్ బుకింగ్స్‌తో రేవంత్ రెడ్డి నడిపిస్తున్నారు. రేవంత్ ఢిల్లీ యాత్రలకు.. తెలంగాణకు ఏ సంబంధం లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.కాంగ్రెస్ పాలన చేపట్టాక రేవంత్ చేసిన మూడు పనులు ఇవే.. మొదటి పని - ఫ్లైటు టికెట్ బుక్ చేయడం! రెండో పని - ఢిల్లీకి పోవడం! మూడో పని ఖాళీ చేతులతో తిరిగి రావడం! అని కేటీఆర్ పేర్కొన్నారు. రైతన్నలు

-మిగతా 2 లో

తరంగాలు జాతీయ దిన పత్రిక
RNI . TELTEL / 2022 / 83463
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

# సామాజిక న్యాయం కాంగ్రెస్‌కే సాధ్యం

(మొదటి తరువాయి)

మధ్యే ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. మోదీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని,11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించ ట్లేదని అన్నారు. వక్రమార్గంలో ఉన్న నేతలను రెండు చెంపదెబ్బలు కొట్టయినా దారిలోకి తెచ్చేందకు కాంగ్రెస్ కృషి చేస్తోంది. మా పార్టీ దేశానికి ఏం చేసిందని విమర్శిస్తున్నారు. 140 ఏళ్ల క్రితం దేశ ప్రజల స్వాతంత్య్రం కోసం కదం తొక్కింది. ఆంగ్లేయులను ఓడించింది. భారత్ నుంచి ఉగ్రవాదులను పారద్రోలేందుకు ఇందిరాగాంధీ కృషి చేశారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ అమరులయ్యారు. యూపీఏ-1 సమయంలో సోనియాగాంధీ ప్రధాని కావాలని అందరూ కోరారు. కానీ, ప్రధాని పదవిని ఆమె త్యాగం చేశారు. 2004లోనే రాహుల్‌గాంధీ కేంద్ర మంత్రి అయ్యేవారు. ఆయన కోరుకుంటే 2009లోనే ప్రధాని అయ్యేవారు. కానీ ప్రధాని, కేంద్ర మంత్రి పదవులు పార్టీ సీనియర్ నేతలకు ఇచ్చారు. కార్యకర్తగానే ప్రజల కోసం రాహుల్‌గాంధీ పనిచేశారు. సామాజిక న్యాయం కోసం 25 ఏళ్లుగా పోరాడుతున్నారు. మరోవైపు నరేంద్ర మోదీ 25 ఏళ్లుగా కుర్చీ వదలట్లేదు. 2001లో సీఎం అయినప్పటి నుంచి ఆయన కుర్చీలోనే ఉన్నారు. భాజపా సంఘ్ పరివార్ మోదీని తప్పించేందుకు ప్రయత్నించింది. కానీ అందుకు ఆయన రాజీ పడలేదు. 75 ఏళ్లు దాటిన వ్యక్తులు కుర్చీ వీడాలని మోహన్ భగవత్ చెప్పారు. కానీ 75 ఏళ్లు దాటినా.. మోదీ అందుకు సిద్ధంగా లేదు. ఇదే నిబంధనతో అద్వాణీ, మనోహర్ జోషిని తప్పించారు. మోదీని సీఎం పదవి నుంచి తప్పించేందుకు గతంలో వాజ్‌పేయీ, ప్రధాని పదవి నుంచి తప్పించేందుకు మోహన్ భాగవత్ ప్రయత్నించారు. ఆయన్ను తప్పించడం వారి వల్ల కాలేదు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ పోరాటం విజయవంతం కాబోతుందని అన్నారు. దేశంలో సామాజిక న్యాయం, దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేసింది కాంగ్రెస్ పార్టీ అని, రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, 11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించడంలేదని, దేశానికి మార్గదర్శనం కోసం మనుసింఘ్వీ నేతృత్వంలో సదస్సు నిర్వహించడం గొప్పవిషయమన్నారు. సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ చేస్తున్నామన్నారు. తెలంగాణ ప్రజల పక్షాన చెబుతున్నా.. రాహుల్ గాంధీని భారత ప్రధానిని చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో దేశానికి ప్రధాని అయ్యే ఛాన్స్ వచ్చిన రాహుల్ గాంధీ వదులుకున్నారని.. కానీ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది రాహుల్ గాంధీ దేశ ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. మోడీని ప్రధాని గద్దె మీద నుంచి కిందకు దించడం ఒక్క రాహుల్ గాంధీకే సాధ్యమన్నారు. మోడీని తరిమికొట్టి భారత రాజ్యాంగాన్ని రక్షిస్తామని పేర్కొన్నారు. మోడీని ఓడిస్తాం.. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామన్నారు. మాది ఎప్పటికీ ప్రజల పక్షమేనన్నారు. పాకిస్థాన్ ను ఇందిరా గాంధీ రెండు ముక్కలు చేశారు. తీవ్రవాదంపై పోరాటం చేసి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ అని కొనియాడారు.

# లోక్‌సభ ఎన్నికల్లో భారీ రిగ్గింగ్

తమ వద్ద ఉన్నాయన్నారు. దీన్ని మేం నిరూపిస్తామని, ఆ డేటా ఇప్పుడు ఉందని రాహుల్ పేర్కొన్నారు.

ఓ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన అధ్యయనాన్ని ఆయన వెల్లడించారు. ఆ నియోజకవర్గంలో ఉన్న 6.5 లక్షల ఓటర్లలో 1.5 లక్షల ఓట్లు నకిలీ అని పేర్కొన్నారు. అలా ఫ్రాడ్ చేసి బీజేపీ అధికారంలోకి వచ్చిందని, 15 లేదా 20 సీట్లు తగ్గి ఉంటే, అప్పుడు మోదీ ప్రధాని అయ్యేవారు కాదని రాహుల్ అన్నారు. ఇండియాలో ఎన్నికల సంఘం చచ్చిపోయిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు- గెలవలేదని, నాకు ఆశ్చర్యం వేసిందని, ఎప్పుడైనా ఎన్నికల అవకతవకల గురించి మాట్లాడితే ఆధారాలు అడుగుతున్నారని రాహుల్ అన్నారు. అయితే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ మార్పు కనిపించిందని, లోక్‌సభకు.. విధానసభకు ఎన్నికల జరిగిన సమయంలో కొత్తగా కోటి ఓటర్లు జత కలిశారని, దాంట్లో ఎక్కువ శాతం ఓట్లు బీజేపీకి వెళ్లాయని, అందుకే తన వద్ద ఆధారాలు ఉన్నట్లు చెబుతున్నాని రాహుల్ పేర్కొన్నారు.ఈ క్రమంలో మరోమారు భారత ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ రాహుల్ గాంధీమరోసారి విరుచుకుపడ్డారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ పూర్తిగా కూలిపోయిందని అన్నారు. ఎన్నికల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ చాలా తక్కువ మెజారిటీతో మూడోసారి ప్రధానిగా గెలుపొందారని అన్నారు. భాజపాకు ప్రయోజనం చేకూర్చడానికి ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనంలో పాలుపంచుకుందని ఆరోపించారు. 2014 నుంచి ఏదో తప్పు జరుగుతోందని తనకు అనిపిస్తోందని.. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల పైనా అనుమానాలు ఉన్నాయని రాహుల్ అన్నారు. ఎన్నికల దుర్వినియోగానికి సంబంధించిన అన్ని ఆధారాలు తమవద్ద ఉన్నాయని.. లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ ఎలా జరిగిందనే విషయాన్ని త్వరలోనే తాము ప్రజల ముందు నిరూపిస్తామని పేర్కొన్నారు. తాము బయటపెట్టే నిజంతో ఈసీ (ఊఈ) పునాదులు కదిలిపోతాయన్నారు. ఓట్ల కుంభకోణంలో పాల్గొన్న ఎన్నికల కమిషన్ అధికారులు పదవీవిరమణ చేసినా కూడా వారిని వదలమని హెచ్చరించారు. భాజపా కోసం ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించిన ఆయన.. దాన్ని రుజువు చేసేందుకు తమవద్ద అణుబాంబు లాంటి ఆధారాలున్నాయని అన్నారు. కాగా ఈ ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. అవన్నీ నిరాధార ఆరోపణలేనని.. రాహుల్ లాంటి వారు చేస్తోన్న బాధ్యతారాహిత్య వ్యాఖ్యలను పట్టించుకోనక్కర్లేదని తెలిపింది.

# బిసి రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ డ్రామాలు

(మొదటి తరువాయి)

బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పిందని.. కానీ ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు అవుతున్న ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎంఐఎం చేతిలో కీలుబొమ్మగా ఉన్న కేసీఆర్ ముస్లింలకు 12శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను 22 శాతానికి కుదించారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అనేక విధాలుగా తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలను పీఎం, సీఎంలను చేసిందా?అని ప్రశ్నించారు. బీసీలకు జనాభా సేకరణ తర్వాతే సామాజిక న్యాయం జరుగుతుంది. ఢిల్లీలో అనేక రకాలుగా సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి మాటలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. బీసీల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ధర్నా నిర్వహించింది. బీసీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును బీజేపీ నేతలు ఎండగట్టారు. బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు , బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. గతంలో అమలైన 35 శాతం కంటే కూడా రెండు శాతం రిజర్వేషన్లు తగ్గించేలా కాంగ్రెస్ కుట్ర చేస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆక్షేపించారు. 20శాతం ఇళ్లలోకి వెళ్లి ఎందుకు సర్వే చేయలేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీలో జనాభా పెరిగిందని బీసీల జనాభా తగ్గిందని లెక్కలు చెబుతున్నారని తెలిపారు. 42 శాతం పూర్తిగా బీసీలకు రిజర్వేషన్లు దక్కాల్సిందేనని డిమాండ్ చేశారు. బీసీల మెడలు కోసేలా ముస్లింలకు రిజర్వేషన్‌లు ఇవ్వడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు న్యాయం చేసిన పార్టీ బీజేపీ మాత్రమేనని ఉద్ఘాటించారు. గత 70 ఏళ్లలో కుల గణన ఎందుకు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కులగణన చేయని కాంగ్రెస్ తరఫున రాహుల్ గాంధీ పార్లమెంట్ ముందు ముక్కు నేలకు రాయాలని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ విషయంలో మార్పు వచ్చిందో సమాధానం చెప్పాలని కిషన్‌రెడ్డి నిలదీశారు. ఇప్పటికే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు కింద ముస్లిం, క్రిస్టియన్‌లకు రిజర్వేషన్‌లు కల్పిస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ విషయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

తెలంగాణ ఏ విషయం లో ఆదర్శమో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ దేశ ప్రజలను మభ్యపెట్టేలా వ్యవహరిస్తున్నారని ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మాయలో మనం పడకూడదని సూచించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం అన్ని బీసీ సంఘాలు పోరాటం చేయాలని కోరారు. బీసీలకు బీజేపీ అండగా ఉంటు-ందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బీసీ జనాభా సేకరణను కాంగ్రెస్ గతంలో ఎందుకు చేయలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ఇంకా ప్రయత్నిస్తూనే ఉందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కానీ బీసీ నేతను ముఖ్యమంత్రి చేశారా అని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ బీసీల పేరుతో రాజకీయం చేయాలని చూస్తోందని.. బీసీలకు ఎక్కడ ప్రాధాన్యమిచ్చిందని నిలదీశారు.

# బనకచర్లపై లోకేశ్‌వి అవగాహన లేని మాటలు

(మొదటి తరువాయి)

ఎపి మంత్రులు బనకచర్ల విషయంలో చేస్తున్న ప్రకటనలు వాస్తవ విరుద్ధమన్నారు, ఇకపోతే కెటిఆర్ లోకేశ్ కలిసిన తరవాతనే లోకేశ్ బనకచర్ల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. ఈ ఇద్దరి మధ్య చీకట్లో ఏ ఒప్పందం కుదరిందో చెప్పాన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతోందని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క అన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదన్నారు. కనీసం గతంలో కాంగ్రెస్ శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులను కూడా ఆ పార్టీ పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ-సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు-చేసిన సభలో మాట్లాడిన ఆయన.. గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కృష్ణా నదిపై గత ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు కూడా ఎందుకు కట్టలేదన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదు. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ నిర్మించే ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయిన తర్వాత బనకచర్ల కట్టుకోవచ్చు న్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు ఏపీ మంత్రులు మాట్లాడకూడదన్నారు. తెలంగాణకు ద్రోహం చేసింది.. భారత రాష్ట్ర సమితని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీ వెళ్లారు కాబట్టే బనకచర్ల ప్రాజెక్టు ఆగిందన్నారు. ఏపీ మంత్రి లోకేశ్ తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయకూడదన్నారు. మిగులు జలాలు ఉంటేకదా బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. 2 లక్షల ఎకరాలు మునిగిపోకుండా పోలవరం కట్టుకోవచ్చు. ముంపు గ్రామాల ప్రజల తరఫున పోరాడేందుకు మేం సిద్ధంగా ఉన్నామని డిప్యూటి సిఎం అన్నారు.

నవభారత్ శత్రువులకు

# కాలభైరవుడు

(మొదటి తరువాయి)

అని ప్రధాని అన్నారు. ఆపరేషన్ సింధూర్ సక్సెస్ వల్ల విపక్ష నేతలకు కడుపు నొప్పి పుడుతోందన్నారు. పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేశామన్న వాస్తవాన్ని కాంగ్రెస్ కానీ, దాని మిత్రులు జీర్ణించుకోలేకపోతున్నట్లు చెప్పారు. విశ్వనాథుడి ఆశీర్వాదంతో ఆపరేషన్ సిందూర్ సక్సెస్ అయ్యిందన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో ప్రతీకారం తీర్చుకున్నామన్నారు.కాశీలో ఉన్న మాస్టర్లను అడగాలనుకుంటున్నానని, భారత శక్తిపై మీరు గర్వంగా ఫీలవ్వడం లేదా అని ప్రధాని అన్నారు. భారత్‌లో తయారీ అయిన ఆయుధాలు ఆపరేషన్ సింధూర్ సమయంలో తమ సత్తాను చాటినట్లు చెప్పారు. పాకిస్థాన్‌లో ఉన్న చాలా వైమానిక స్థావరాలు ఇంకా ఐసీయూ స్థితిలోనే ఉన్నాయని, పాకిస్థాన్ బాధపడుతోందని, దాన్ని ఎవరైనా అర్థం చేసుకోగలరని, కానీ కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు మాత్రం పాకిస్థాన్ బాధను చూడలేకపోతున్నారని ప్రధాని అన్నారు. ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చే వాళ్లు పాకిస్థాన్‌లోనూ, ఇండియాలోనూ ఏడుస్తున్నారని విమర్శించారు. మన సైనిక బలగాలను కాంగ్రెస్ నిత్యం అవమానిస్తోందని, ఆపరేషన్ సింధూర్‌ను తమాషా అని పిలుస్తోందని మోదీ అన్నారు. కాంగ్రెస్ వ్యాఖ్యలను సిగ్గులేని చర్యగా ఆయన అభివర్ణించారు. ఉగ్రవాదులను ఇప్పుడు ఎందుకు చంపారని సమాజ్‌వాదీ పార్టీ అడుగుతోందని, వాళ్లను పిలిచి.. చంపాలా వద్దా అని అడగాలా, లేదంటే వాళ్లు పారిపోయే వరకు వేచి చూడాలని అని ప్రశ్నించారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో భారతదేశ రుద్ర స్వరూపాన్ని ప్రపంచం తిలకించిందని, ఇప్పుడు నవ భారతం శత్రువులకు కాలభైరవుడిగా మారినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు.

# ట్రంప్ మాటలు...అబద్ధం

(మొదటి తరువాయి)

వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలపై ఇవి నిర్మొహమాటంగా ట్రంప్ చెంప ఛెల్లుమనేలా సమాధానం ఇచ్చాయి.భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇదే ప్రశ్నను పలు ఏఐ ప్లాట్‌ఫామ్‌లను అడగ్గా.. అవి చెప్పిన సమాధానాలు ట్రంప్ మూర్ఖత్వాన్ని తెలియచేశాయి. భారత్‌ది డెడ్ ఎకానమియా? అని ఐదు ప్రధాన అమెరికన్ ఏఐ ప్లాట్‌ఫామ్‌లను ప్రశ్నించగా.. వాటి సమాధానాలు ట్రంప్ వ్యాఖ్యలకు విరుద్ధంగా ఉన్నాయి. భారత ఆర్థికవ్యవస్థ పతనం కాలేదు. అది డైనమిక్. ఎంతో ప్రతిష్ఠాత్మకమైనది' అని చాట్‌జీపీటీ పేర్కొంది. భారత్‌ది డెడ్ ఎకానమీ కాదు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని గ్రోక్ వెల్లడించింది. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా వృద్ధి చెందుతుంది' -జెమిని తెలిపింది. ఇక, మెటా ఏఐ, కోపైలట్ లు కూడా ఇలాంటి సమాధానాలే ఇచ్చాయి. రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తుందనే కారణంతో భారత్‌పై 25శాతం సుంకం, పెనాల్టీలు విధిస్తున్నట్లు- ట్రంప్ ప్రకటించారు. దీన్ని ప్రకటించిన కొన్ని గంటల్లోనే మన ఆర్థిక వ్యవస్థను ఉద్దేశిస్తూ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. రష్యా, భారత్.. వాటి డెడ్ ఎకానమీలను మరింత దిగజార్చుకునే అవకాశముందన్నారు. వారు ఎలాంటి వాణిజ్య సంబంధాలు కుదుర్చుకున్నా పట్టించుకోనన్నారు. ఈ వ్యాఖ్యలను భారత్ తోసిపుచ్చింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. మరోవైపు, ట్రంప్ మాటలను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సమర్థించారు. ట్రంప్ చెప్పింది వాస్తవమేనని, ఆ విషయాన్ని ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. దేశ ఆర్థిక, రక్షణ, విదేశాంగ విధానాన్ని భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం నాశనం చేసిందని ఆరోపించారు. అయితే, రాహుల్ వ్యాఖ్యలను సొంత పార్టీ నేతలు సైతం తప్పుబట్టడం గమనార్హం. ఈ క్రమంలో ఏఐ సమాధానాలు ట్రంప్‌కు, రాహుల్‌కు చెంపపెట్టులాంటివే.

# కాళేశ్వరం కేసులో కేసీఆర్ పక్కా దోషి

(మొదటి తరువాయి)

రాజనర్సింహ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. తనకి ఇష్టం ఉన్న చోట కాళేశ్వరం ప్రాజెక్టు కట్టాలని కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. రెండే పిల్లర్లు కుంగాయని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని...ఇది సామాన్య విషయమా..? అని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కారు రేస్‌లో మాజీ మంత్రి కేటీఆర్ అవినీతికి పాల్పడలేదా..? అని నిలదీశారు. ప్రభుత్వ సొమ్ము తిన్న వాళ్లు కక్కక తప్పదని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. మాజీ సిఎం కెసిఆర్ సొంత లాభం మాత్రమే చూసుకున్నారని తెలిపారు. కెసిఆర్ దోషి అని కాళేశ్వరం కమిషన్ తేల్చిందని అన్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్న నియోజక వర్గాల్లో ఇబ్బందులు ఉన్నాయని, ప్రతిపక్షాల కుట్రల వల్ల వేరే పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నామని తెలియజేశారు. కాంగ్రెస్‌లో గ్రూపులు సహజం.. పార్టీలో గ్రూపులు ఉండాలని, ఎన్నికల సమయానికి అందరూ పార్టీ కోసం పోరాడాలని సూచించారు. గ్రూపుల వల్ల నష్టం జరగకుండా చూసుకునే బాధ్యత తమది అని హామీ ఇచ్చారు. కెసిఆర్ కుటుంబం అబద్ధాల పుట్టని, బిఆర్ఎస్ చేతగానితనం వల్ల బనకచర్ల ప్రాజెక్టుకు ఎపి ప్రభుత్వం సిద్ధమైందని మండిపడ్డారు. తమ ఫిర్యాదు వల్లే బనకచర్ల ప్రాజెక్టు పనులు ఆగాయని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ఆయన దగ్గర ఆటమ్ బాంబు ఉంటే పేల్చనివ్వండి'

(మొదటి తరువాయి)

అయితే ఆ పేలుడు ఎలాంటి హాని జరగకుండా ఆయనను ఆయన కాపాడుకోవాలి' అని వ్యాఖ్యానించారు.అధికార బీజేపీ కోసం ఈసీ ఓట్ల చౌర్యానికి పాల్పడుతుందంటున్న రాహుల్‌గాంధీ తన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని రక్షణ మంత్రి హెచ్చరించారు. లేదంటే శనివారం పూట నిప్పుతో ఆడుకోవడమైనా ఆపాలని వార్నింగ్ ఇచ్చారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్లో భూకంపం సృష్టించబోతున్నాడని గతంలో కూడా ఆయన మనుషులు హంగామా చేశారని రాజ్‌నాథ్ గుర్తుచేశారు.కానీ రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో మాట్లాడినా ఎలాంటి భూకంపం రాలేదని, పైగా ఆ ప్రసంగం తడిచిన పటాసు లెక్క తుస్సుమన్నదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ చేతికి ఎమర్జెన్సీ రక్తపు మరకలు ఉన్నాయని రాహుల్‌గాంధీ గుర్తుపెట్టుకోవాలని, వైరిపక్షాలపై నోటికొచ్చిన ఆరోపణలు మానుకోవాలని రాజ్‌నాథ్ హితవుపలికారు.

# 50 ట్రిప్స్.. జీరో రిజల్ట్స్..!

(మొదటి తరువాయి)

ఇబ్బందులను తట్టుకుని పండించిన పంటలకు మార్కెట్లో మద్దతు ధర లేదు.. రైతులు పొలాల్లో జల్లడానికి యూరియా లేదు.. సాగునీళ్లు రావు.. తాగునీళ్లు లేవు.. కాళేశ్వరం ఎత్తిపోతల మరమ్మతు పనులు జరగకుండా అడ్డుకుంటూ తెలంగాణకు ద్రోహం చేస్తున్నామన్న సోయి లేదు. బనకచర్ల నిర్మాణంతో తెలంగాణ శాశ్వతంగా నష్టపోతుందన్న ఆలోచన లేదు అని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాల ఊసు లేదు.. జాబ్ క్యాలెండర్ల జాడ లేదు. రుణమాఫీ కాలేదు - రైతు భరోసా రాలేదు. తులం బంగారం ఊసు లేదు.. రూ.4 వేల ఫించన్ జాడ లేదు. గురుకులాల గోడు పట్టదు గురుకుల విద్యార్థుల ఆకలి కేకలు వినపడడం లేదు. కానీ రేవంత్ రెడ్డి 3 రోజుల్లో 3 ఫ్లైట్‌లు ఎక్కుతున్నాడు.. దిగుతున్నాడు. "ఒక్కసారి కాదు.. రెండు సార్లు కాదు.. 50 సార్లకు చేరిన హస్తిన యాత్ర. కానీ తెచ్చింది ఏమీ లేదు! శుష్కప్రియాలు.. శూన్య హస్తాలు. అయిననూ పోయి రావలె హస్తినకు అని పేర్కొంటూ రేవంత్‌పై కేటీఆర్ ధ్వజమెత్తారు. కానీ ఢిల్లీ యాత్రలతో మన రాష్ట్రానికి వచ్చిందేమిటి?? నో ప్రాజెక్ట్, నో ఫండింగ్, నో ప్యాకేజీ.. దానికి బదులు దక్కింది మాత్రం ఫోటో షూట్లు, వీడియోలు. విందు రాజకీయాలు! అని పేర్కొన్నారు.

# తేజస్వి ఆరోపణలు అబద్ధం..

## -ఓటర్ల జాబితాలో ఆయన పేరు ఉంది -ఎన్నికల సంఘం




**న్యూఢిల్లీ--02 ఆగస్ట్-తరంగాలు**
బీహార్ లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తర్వాత విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా లో తన పేరు లేదని, తాను ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలని ఆర్జేడీ అగ్రనేత తేజస్వియాదవ్ ప్రశ్నించడంపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. ఓటర్ల జాబితాలో తన పేరు లేదని తేజస్వి యాదవ్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అబద్ధమని, జాబితాలో ఆయన పేరు ఉన్నదని తెలిపింది.ముసాయిదా ఓటర్ల జాబితాలో సీరియల్ నెంబర్ 416తో తేజస్వియాదవ్ ఓటు ఉన్నదని ఈసీ వెల్లడించింది. కాబట్టి ఓటర్ల జాబితాలో తన పేరు లేదని తేజస్వియాదవ్ చేస్తున్న ప్రచారమంతా శుద్ధ అబద్ధమని పేర్కొంది. కాగా బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఇటీవల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో ఓటర్ల జాబితాను సవరించింది.అయితే ఈ సవరణపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఎన్నికల సంఘం అధికార బీజేపీకి అనుకూలంగా పనిచేస్తున్నదని, ఎస్ఐఆర్ పేరుతో బీహార్‌లో బీజేపీ వ్యతిరేక ఓట్లను జాబితా నుంచి తొలగించిందని ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా తేజస్వి యాదవ్ ముసాయిదా జాబితాలో తన పేరును కూడా తొలగించారని ప్రెస్ మీట్ పెట్టి మరీ చెప్పారు. అయితే ఆయన ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది.

# పాకిస్థాన్‌లో పట్టాలు తప్పిన రైలు..

## 29 మంది ప్రయాణికులకు గాయాలు




**లాహోర్ -02 ఆగస్ట్-తరంగాలు**
పాకిస్థాన్‌లో రైలు పట్టాలు తప్పిన ఘటనలో 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. లాహోర్ సమీపంలో ఇస్లామాబాద్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ముగ్గురు ప్రయాణికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. లాహోర్ నుంచి రావల్పిండి వెళ్తున్న రైలు కాలా షా కాకు వద్ద డిరేల్ అయినట్లు పాకిస్థాన్ రైల్వేశాఖ తెలిపింది. లాహోర్‌కు 50 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది.రైలుకు చెందిన పది బోగీలు పట్టాలు తప్పాయి. రెస్క్యూ బృందాలు తక్షణమే స్పందించాయి. గాయపడ్డవారిని సమీప ఆస్పత్రికి తరలించారు. డిరేల్ అయిన బోగీల్లో చిక్కుకున్నవారిని తొలగించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదం పట్ల దర్యాప్తు చేయాలని రైల్వే శాఖ మంత్రి మొహమ్మద్ హనిఫ్ అబ్బాస్ ఆదేశించారు. ఏడు రోజుల్లోనే రిపోర్టు ఇవ్వాలన్నారు.

# ప్రాణాంతక బ్యాక్టీరియా వల్ల అర్జెంటీనాలో 68 మంది మృతి




**న్యూఢిల్లీ- -02 ఆగస్ట్-తరంగాలు**
అర్జెంటీనాలో ప్రాణాంతక బ్యాక్టీరియా సోకి వ్యాధుల బారిన పడి వందలాది మంది ఆసుపత్రుల్లో చేరారు. ఆసుపత్రుల్లో చేరిన రోగులకు వైద్యులు ఫెంటానిల్ ఇంజెక్షన్ ఇచ్చారు. ఈ ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత 68 మంది మృతి చెందారు. ఇంకా మృతుల సంఖ్య పెరిగే అకాశం ఉందని వైద్యాధికారులు భయపడుతున్నారు. ఔషధ పర్యవేక్షణలో వ్యవస్థాగత వైఫలాల్యను ఇది బహిర్గతం చేసింది. అర్జెంటీనా గత కొన్ని దశాబ్దాలుగా ఔషధ సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫెంటానిల్ ఇంజెక్షన్ వల్లే 68 మంది రోగులు మృతి చెందినట్లు న్యాయ విచారణలో తేలింది. 2025 ఏప్రిల్‌లో లా పాటాలోని హాస్పిటల్ ఇటాలియానోలో ఫెటానిల్ ఇంజెక్షన్ వల్ల ఐసియులో ఉన్న 15 మంది మృతి చెందారు. ఈ సంఘటనతో ఔషధాలలో జరుగుతున్న అవకతవకలు మొదటిసారిగా వెలుగులోకొచ్చింది.

# కుల్గాంలో ఉగ్రవాది హతం



**కాశ్మీర్--02 ఆగస్ట్-తరంగాలు**
శనివారం దక్షిణ కాశ్మీర్‌లోని కుల్గాం జిల్లా అఖల్ ప్రాంతంలో భద్రతా దళాలు చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. శుక్రవారం (ఆగస్టు 1) సాయంత్రం నుండి ఆ ప్రాంతంలోని అడవుల్లో దాక్కున్న ఉగ్రవాదులపై ఆర్మీ, సిఆర్పీఎఫ్, మరియు పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజి) సంయుక్తంగా ఆపరేషన్ ప్రారంభించాయి. రాత్రి సమయంలో తీవ్ర కాల్పులు చోటుచేసుకున్నాయి. భద్రతా దళాలు అప్రమత్తంగా స్పందించడంతో ఒక ఉగ్రవాది మృతి చెందాడు. ఇంకా కొంతమంది ఉగ్రవాదులు అక్కడే దాక్కుని ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ విషయాన్ని చినార్ కార్ప్స్ అధికారికంగా వెల్లడించింది.ఈ వారం జమ్మూ & కాశ్మీర్‌లో ఇది మూడవ ఎన్‌కౌంటర్. ఇటీవల పహల్గాం దాడిలో పాల్గొన్న ముగ్గురు ఉగ్రవాదులతో పాటు ఇప్పటివరకు ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. భద్రతా పరంగా పరిస్థితిని అదుపులో ఉంచేందుకు దళాలు భారీ నిఘా కొనసాగిస్తున్నాయి.

# లైంగిక దాడి కేసులో మాజీ ప్రధాని మనుమడు ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు..

**న్యూఢిల్లీ-02 ఆగస్ట్-తరంగాలు**
లైంగిక దాడి కేసులో మాజీ ఎంపీ, హెచ్‌డీ దేవేగౌడ మనుమడు ప్రజ్వల్ రేవణ్ణకు కోర్టు జైలు శిక్ష ఖరారు చేసింది. ఆయనకు జీవితై ఖైదు విధిస్తూ తీర్పును వెలువరించింది. ఓ తనపై అత్యాచారం చేసి బెదిరింపులకు పాల్పడినట్లు మహిళ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రజ్వల్ రేవణ్ణను ప్రత్యేక కోర్టు దోషిగా తేల్చింది. శనివారం తీర్పును వెలువరించనున్నట్లు ప్రకటించింది. తాజాగా కోర్టు శనివారం ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు విధించింది. ప్రజ్వల్ రేవణ్ణపై నాలుగు అత్యాచార కేసులు ఉన్నాయి. ఈ కేసులో ప్రజ్వల్ ఇప్పటికే 14 నెలలుగా జైలు జీవితం గడిపారు.మైసూర్‌లోని కేఆర్ఎస్ నగర్‌కు చెందిన పని మనిషిపై అత్యాచారం కేసులో ప్రజ్వల్‌ను దోషిగా తేలుస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సంతోష్ గజానన్ భట్ తీర్పును వెలువరించారు. ప్రభుత్వం తరపున న్యాయవాది జగదీష్ వాదనలు వినిపించారు. ప్రజ్వల్ చర్య నీచమైందని.. జీవనోపాధి కోసం పని కోసం వచ్చిన చదువు రానివారిపై దారుణ చర్యకు పాల్పడ్డాడని.. వీడియోలు చిత్రీకరించడం బాధితురాలిని మానసికంగా కూడా హింసించడమేనని.. ఓ దశలో



బాధితురాలు ఆత్మహత్యకు ప్రయత్నించిందని కోర్టుకు తెలిపారు. ప్రజ్వల్‌పై మరో మూడు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వాదనలు వినిపించారు.ప్రజ్వల్ రాజకీయాల్లోకి కేవలం డబ్బు కోసమే రాలేదని, ప్రజ్వల్ ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు వీడియోలు దురుద్దేశంతో లీక్ చేశారని.. అతని రాజకీయ భవిష్యత్‌ను నాశనం చేసేందుకు ఈ చర్యకు పాల్పడ్డారంటూ వాదనలు వినిపించారు. ప్రజ్వల్ ఏడాది జైలులో ఉన్నాడని.. ఈ కేసుతో అతనికి తీవ్రమైన నష్టం జరిగిందని తెలిపారు. అతని కెరీర్‌కు ఇబ్బందికలిగేలా శిక్ష విధించొద్దని కోరారు. ఈ సందర్భంగా ప్రజ్వల్ రేవణ్ణ కోర్టు ఎదుట మాట్లాడుతూ తనపై చాలా మంది ఇలాంటి ఆరోపణలు చేశారన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో ఈ ఆరోపణలు ఎందుకు చేయలేదన్నారు.తాను అత్యాచారం చేసి ఉంటే వాళ్లు ఎవరికీ ఎందుకు చెప్పలేదని.. లోక్‌సభ ఎన్నికలకు ముందే ఎందుకు ఆరోపణలు చేశారని.. పోలీసులు కావాలని ఇలా చేశారంటూ ప్రజ్వల్ కోర్టులో కన్నీరు పెట్టుకున్నారు. తాను మెకానికల్ ఇంజినీరింగ్ చదివానని.. గత ఆరు నెలలుగా నా తల్లిదండ్రులను చూడలేదని.. కోర్టు ఏ నిర్ణయం తీసుకున్నా, దానికి తాను కట్టుబడి ఉంటానని తెలిపారు. శిక్ష విధించే సమయంలో కుటుంబాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు ప్రజ్వల్‌ను దోషిగా ప్రకటించింది. జీవిత ఖైదు విధించడంతో పాటు రూ. 5లక్షల జరిమానా విధించింది. బాధితురాలి కుటుంబానికి రూ. 7లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. లైంగిక దాడి కేసులో ప్రజ్వల్‌కు జీవిత ఖైదు విధించడంతో రాజకీయ జీవితం తెరపడ్డట్లేనని భావిస్తున్నారు.

# 20వ విడత కిసాన్ సమ్మాన్ నిధి విడుదల

## వారణాసి పర్యటనలో ప్రారంభించిన ప్రధాని మోడీ

**వారణాసి, --02 ఆగస్ట్-తరంగాలు**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారణాసి నుంచి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత మొత్తాన్ని విడుదల చేశారు. సేవాపురిలోని బనౌలిలో జరిగిన కార్యక్రమంలో ఈ విడతను అధికారికంగా విడుదల చేశారు. ఈసారి దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ. 20,000 కోట్లు బదిలీ అయ్యాయి. ఈ పథకం ద్వారా రైతులకు ఏడాదికి మూడు విడతల్లో రూ. 6,000 ఆర్థిక సాయం అందుతుంది. అంటే, ఒక్కో విడతలో రూ. 2,000



చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ అవుతాయి. అంతకుముందు, జూన్ 18, 2024న, ప్రధానమంత్రి మోదీ నుంచి రూ. 9.26 కోట్ల మంది రైతుల ఖాతాలకు సమ్మాన్ నిధిని రిలీజ్ చేశారు. వారణాసి పర్యటనలో భాగంగా మోదీ దాదాపు రూ. 2,200 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతోపాటు- శంకుస్థాపన చేశారు. వీటిలో రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్లు సహా రకరకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు వారణాసి ప్రజల జీవితాలను మరింత మెరుగుపరుచనున్నాయి. ఈ అభివృద్ధి ప్రాజెక్టులు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కూడా పెంచబోతున్నాయని తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులు రైతుల జీవితాలు, గ్రామీణ భారతాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు. ఈ కర్యక్రమంలో సిఎం యోగి తదితరులు పాల్గొన్నారు.

# ఇలాగే కొనసాగితే.. హిమాచల్ ప్రదేశ్ అదృశ్యం కావొచ్చు

## -సుప్రీంకోర్టు వార్నింగ్

**షిమ్లా -02 ఆగస్ట్-తరంగాలు**
హిమాచల్‌ప్రదేశ్ లో జరుగుతున్న పర్యావరణ మార్పుల పట్ల సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఒకవేళ పరిస్థితి ఇలాగే కొనసాగితే, కొంచెం గాలి వీచినా, ఆ రాష్ట్రం అదృశ్యం అయ్యే అవకాశాలు ఉన్నట్లు వార్నింగ్ ఇచ్చింది. అభివృద్ధి పనులను నియంత్రించకుంటే ఇలాగే జరుగుతుందని కోర్టు తన తీర్పులో హెచ్చరించింది. జస్టిస్ జేబీ పర్దివాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఓ పిటీషన్ విచారణ సమయంలో పేర్కొన్నది.ఆదాయం రాబట్టడమే కీలకం కాదు అని, కేంద్ర.. రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని గమనించాలని, పర్యావరణాన్ని దెబ్బతీసి ఆదాయాన్ని ఆర్జించలేమని కోర్టు చెప్పింది.



ప్రస్తుతం కొనసాగుతున్న రీతిలో పనులు జరిగితే, భారత దేశ మ్యాప్ నుంచి హిమాచల్ ప్రదేశం మాయం అయ్యే రోజు దగ్గరలోనే ఉన్నట్లు ధర్మాసనం వెల్లడించింది. ఇలా జరగవద్దు అని ఆ దేవుడిని కోరుకుంటామని, ఇప్పుడైనా సరైన దిశలో చర్యలు తీసుకోవాలని సుప్రీం బెంచ్ తెలిపింది. ప్రిస్టిన్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ సంస్థ వేసిన పిటీషన్‌పై జూలై 28వ తేదీన వాదనలు జరిగాయి. ఆ సమయంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. శ్రీ తారా మాతా కొండపై హోటల్ నిర్మాణానికి పర్మిషన్ ఇవ్వాలని ఆ సంస్థ కోరింది. కానీ సుప్రీం ధర్మాసనం దాన్ని తిరస్కరించింది. వాతావరణ మార్పులు హిమాచల్ ప్రదేశ్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ఇది స్పష్టంగా కనిపిస్తోందని కోర్టు తెలిపింది .హిమాచల్‌లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, మంచు కురిసే పరిస్థితులు కూడా మారాయని, గరిష్ట వాతావరణ పరిస్థితులు ఉంటున్నాయని కోర్టు చెప్పింది. హిమాలయ ప్రాంతంలో అనేక నదులకు జీవాధారమైన గ్లేసియర్లు త్వరగా కరుగుతున్నాయని, దీంతో అకస్మాత్తుగా వరదలు వస్తున్నట్లు కోర్టు పేర్కొన్నది. హిమాచల్‌లోని బారా షిగ్రి గ్లేసియర్ క్రమంగా తగ్గిందని కోర్టు తెలిపింది.

# ఎన్నికల కమిషన్ మోడీకి కీలుబొమ్మ

**న్యూఢిల్లీ--02 ఆగస్ట్-తరంగాలు**
త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మైనార్టీ, దళితుల ఓట్లు తొలగింపే లక్ష్యంగా వ్యవస్థలు పని చేస్తున్నాయని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే అన్నారు. ఇది ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓ ట్రేండ్ గా మారిందని మండిపడ్డారు.ఢిల్లీలో జరుగుతున్న AICC లీగల్ కాన్క్లేవ్ సదస్సులో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. ఓటర్ల జాబితా నుండి పేర్లను సామూహికంగా తొలగించడం ద్వారా ముఖ్యంగా పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలు వారి ఓటు హక్కును క్రమంగా కోల్పోతున్నారని ఆరోపించారు.ఈ విధంగా లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని విమర్శించారు. ఈ



ప్రక్రియను తామంత వెంటనే కట్టడి చేయలని ఆయన పిలుపునిచ్చారు. ఈచర్యతో రాజ్యాంగం కల్పించిన హక్కును కోల్పోతున్నారని, వాటిని రక్షించే బాధ్యత ప్రభుత్వంపై ఈసీపై ఉందని ఆయన గుర్తు చేశారు.'రాజ్యాంగ హక్కుల హరించుకుపోవడానికి ప్రభుత్వం, ఎన్నికల సంఘం బాధ్యత వహిస్తాయి. సుప్రీంకోర్టు ఈ విషయం యొక్క తీవ్రతను గుర్తించింది, కానీ అనేక విచారణలు జరిగినప్పటికీ, ఎన్నికల సంఘం తన ప్రవర్తనను మార్చుకోలేదు" అని ఖర్గే అన్నారు. ఎన్నికల కమిషన్ తన స్వయంప్రతిపత్తిని కోల్పోయిందని ఆయన ఆరోపించారు. అత్యున్నత ఎన్నికల సంస్థను ప్రధాని మోడీ కీలుబొమ్మగా అభివర్ణించారు. "బీహార్‌లో 65 లక్షల లేదా 1 కోటి మంది ఓటర్లకు ఓటు హక్కును నిరాకరించడం దళితులు, వెనుకబడిన వర్గాలను పాల్గొనకుండా మినహాయించడానికి ఉద్దేశపూర్వక కుట్ర అని ఆయన అన్నారు.

## సంపాదకీయం

# ఎదురుదాడితో... అక్రమాలను దాచలేము

ఎదురుదాడి రాజకీయాల్లో ఇప్పుడు బిఆర్ఎస్, ఎపిలో వైకాపాలు ఆరితేరాయి. చేసిన తప్పులు, అప్పుల గురించి ఎవ్వరూ చర్చించుకోవద్దన్న పాలసీతో వీరు ఎదుటివారిపై బురదజల్లాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఇద్దరూ ఒకే గూటి పక్షులుగా ఉన్నారు. ఎపిలో అప్పులు చేసి, బటన్ నొక్కుళ్లతో రాష్ట్రాన్ని దివాళా తీయించి, సొంత ఖజానా నింపుకున్న ఘనుడు జగన్. తెలంగాణలో కూడా కుటుంబం గుప్పిట్లో అధకారం పెట్టుకుని రాష్ట్రాన్ని దివాళా తీయించిన ఘనత కెసిఆర్ కుటుంబానిది. అంతేగాకుండా లెక్కకు మిక్కిలి అప్పులు చేసి ఇప్పుడేమో....మాకా సంగతే తెలియదన్న రీతిలో పోజులు పెడుతున్నారు. కెటిఆర్, హరీష్ రావుల విమర్శలు చూస్తుంటే సిగ్గేస్తోంది. జాలి కలుగుతోంది. ఎందుకంటే చేసిన తప్పులన్నీ చేసి, మళ్లీ తమదే అధికారం కనుక ఇవేవీ బయటపడవన్న ధీమాతో ఉండిపోయారు. కానీ ప్రభుత్వం మారడంతో అప్పులు, తప్పులు బయటకు తన్నుకు వస్తున్నాయి. వీటిని కప్పిపుచ్చుకునేందుకు రోజుకో అంశంపై విమర్శలు చేస్తున్నారు. గురుకులాలు, హాస్టళ్లు, రైతులు, బనకచర్ల, విద్యుత్ పంపిణీ తదితర అంశాలపై వీరు చేస్తున్న విమర్శలు అన్నీ ఇన్నీ కావు. నిజంగానే పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఇవన్నీ బాగావుంటే, బాగుచేసివుంటే ఇప్పుడే పాపం ఎందుకు బద్దయలయ్యిందన్నది ప్రజలు ఆలోచించాలి. అన్నింటికి మించి కాళేశ్వరంలో లక్షకోట్లు తగలేశారు. వారికి రావాల్సిన ముడుపులు రావడంతో ఏమయితే మనకేంటన్న ధోరణిలో ఉన్నారు. అందుకే ఇవన్నీ ప్రజలు చర్చించుకోవద్దన్న భావనలో రోజూ బనకచర్లను ముందుకేసి విమర్శలు చేస్తున్నారు. సిఎం ప్రజల్లోకి రావడమెందుకు, ఆయన ప్రజలను కలవాల్సిన పనేముందని వాదించిన కెటిఆర్ ఇప్పుడు పనిచేసే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాడు. నవ్విపోదురు నాకేంటి అన్న చందంగా కెటిఆర్,హరీష్ రావుల విమర్శలకు హద్దూపద్దూ లేకుండా పోతోంది. అలాగే జగన్ తీరు కూడా అలాగే ఉంది. వీరు దోచుకోవడం అన్న స్కూళ్లో శిక్షణ పొంది వచ్చినవారు. ఇక కాళేశ్వరం నివేదిక చూస్తే ఆశ్చర్యం కలగమానదు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, వైఫల్యాల్లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్ర కీలకమని జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ తేల్చింది. ఈ విషయంలో ఆయన పాత్ర విస్మరించలేనిదని స్పష్టం చేసింది. ఆయనతోపాటు ఆనాటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అంతేకాకుండా.. అప్పటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఈఎన్‌సీలుగా పనిచేసినవారు, మరికొందరు అధికారులను కూడా వైఫల్యాలకు బాధ్యులుగా పేర్కొంటూ నివేదిక రూపొందించింది. బ్యారేజీల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదమే తీసుకోలేదని తెలిపింది. బ్యారేజీలపై ముందుగానే నిర్ణయం తీసుకొని.. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదన్న సీడబ్ల్యూసీ నివేదికను కేవలం సాకుగా చూపించారని వెల్లడించింది. పైగా బ్యారేజీల నిర్మాణానికి ముందు భూ భౌతిక పరీక్షలను శాస్త్రీయ ప్రమాణాలతో జరపలేదని పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరిపిన కమిషన్ గురువారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా.. దానిని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించేందుకు మంత్రివర్గం ఆమోదం తీసుకోలేదని, మంత్రివర్గ ఉపసంఘం వేసినా.. దీనికి, ఆ బ్యారేజీలకు సంబంధమే లేదని పీసీ ఘోష్ కమిషన్ తేల్చిందని తెలుస్తోంది. వీటి గురించి కెటిఆర్ మాట్లాడరు. హరీష్ రావు మాట్లాడరు. నోరుంది కదాని తప్పుడు మాటలతో మభ్య పెట్టే ప్రయత్నాల్లో ఈ ఇద్దరూ ఆరితేరారు. అయితే మంత్రివర్గ ఆమోదంతోనే బ్యారేజీలు నిర్మించినట్లు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, ఈటల రాజేందర్ చెప్పడం ఇంకా మోసం చేయడం తప్ప మరోటి కాదు. ఒక ఉద్యమ పార్టీగా ప్రజల ఆకాంక్షలకు న్యాయం చేయకుండా వారి నమ్మకాన్ని దెబ్బతీసింది. ఒక కుటుంబానికి వ్యాపార సామ్రాజ్యంగా మారిందనడానికి కాళేశ్వరం సహా అనేక ఉదాహరణలు ఉన్నాయి. గొర్రెల పంపిణీలో వేయికోట్ల మోసం అంటే ఎంత దారుణమో గుర్తించాలి. ఒక ఉద్యమ పార్టీ ఎంతగా అహంకారంగా ప్రవర్తించిందో చూసాం. ప్రజలు ఎలా మోసపోయారో చూసాం. ఇందుకు కాళేశ్వరం, గొర్రెలు, చేపలు, రైతుబంధు వంటి అన్ని పథకాలు చూడవచ్చు. సిఎం రిలీఫ్ ఫండ్ పేరుతోనూ మోసాలు సాగించారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఓటమిని జీర్ణించుకోలేక అనవసరంగా గట్టిగా రంకెలు వేస్తోంది. ఒక్కో అవినీతి బయటపడ్డా కొద్దీ జీర్ణించుకోలేక పోతున్నది. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి కుటుంబం, ప్రతి యువకుడి ఆశయాల మీద చేసిన మోసపూరి రాజకీయం బహుశా చరిత్రలో ఎవరూ చేసివుండరు. ఒక నాయకుడు తప్పు చేస్తే దాన్ని ప్రజల ముందుకు తీసుకురావడం మీడియా బాధ్యత. కానీ ఇక్కడ పార్టీతో పాటు,ఓ కుటుంబం మోసం చేసింది. అయినా పదేళ్లుగా మీడియా ఈ విషయం ప్రసారం చేయలేదు. దాన్ని ఇప్పుడైనా ప్రశ్నించాలి. మీడియా స్వేచ్ఛను అణచివేయాలని చూసిన ఘనులు బిఆర్ఎస్ నేతలు. ప్రజాస్వామ్యంలో అది క్షమించదగినది కాదు. అసలు బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నమ్ముకుని అమ్ముకోవడమెలాగో నేర్చింది. ఇన్న తప్పులకు కారణమైన కెటిఆర్, హరీష్ రావులు ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేస్తున్న విమర్శలు...దగుల్బాజీ రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. నిరాశా నిస్పృహల్లో ఉంటూ ప్రస్తుత పరిస్థితిని చూసి తట్టుకోలేని మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అందుకే అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నారు. రాజకీయాల్లో నీతిగా మాట్లాడటం బిఆర్ఎస్, వైకాపా నాయకులకు రాదు. వీరు పాలనార్హత లేనివారు. ప్రజల తీర్పును గౌరవించలేక, దాన్ని హేళన చేయడమంటే అది ప్రజల ను నిందించడమే అవుతుంది. జగన్, కెటిఆర్‌లు ఇది గమనించాలి. ప్రజలను అవమానిస్తున్న ఈ నేతలను ప్రజలు దూరంగా పెట్టాలి. బీఆర్ఎస్ పదేళ్ల పరిపాలనలో తెలంగాణకు సాధ్యమైనంత మోసం చేయమెలా అన్న రీతిలో పాలన సాగింది. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష మేరకు అసలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకుని రాలేకపోయింది.రైతులు అప్పుల్లోనే ఉన్నారు, యువత నిరుద్యోగంలో ఉన్నారు. రుణమాఫీ రాయితీల పేరుతో కొంతమంది మాత్రమే లబ్ధి పొందారు. పేపర్ లీకులు, గ్రూప్ పరీక్షల వాయిదాలు, పోలీస్ పరీక్షల గందరగోళం ఇవన్నీ యువత భవిష్యత్తును నాశనం చేశాయి. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ అప్పు రూ. 6.5 లక్షల కోట్లకు చేరింది. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ఇవన్నీ పేరుకి ప్రాజెక్టులు. కానీ అన్నీ అవినీతి పథకాలే. జేబులు నింపే పథకాలే.

# ఆగస్టు 5న విప్లవ వార్షికోత్సవం



ఢాక-02 02 ఆగస్ట్-తరంగాలు
బంగ్లాదేశ్‌లోని యూనిస్ ఖాన్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. షేక్ హసీనా దేశాన్ని వదిలిన ఆగస్టు 5న విప్లవ వార్షికోత్సవం గా జరుపుకోబోతోంది. హసీనా ప్రభుత్వాన్ని కూల్చివేసిన ఒక ఏడాది పూర్తయిన సందర్భంగా ఆ రోజే, ప్రజాస్వామ్య సవరణల జాబితాను విడుదల చేస్తున్నట్లు బంగ్లా ప్రభుత్వం శనివారం తెలిపింది . ఈ సంస్కరణలకు సంబంధించి రాజకీయ పార్టీల ఆమోదం కోసం ముసాయిదా కాపీలను పంపారు. ప్రధాన సలహాదారు షఫీకుల్ ఆలం మాట్లాడుతూ..వచ్చే మంగళవారం ఆగస్టు 5 సాయంత్ర 5 గంటలకు జరిగే వేడుకల్లో అన్ని పార్టీల సమక్షంలో ఈ సంస్కరణలను దేశం ముందు ఉంచుతాం అని చెప్పారు. బంగ్లాదేశ్ జాతీయ ఏకాభిప్రాయ కమిషన్ నిర్వహించిన చర్చల్లో, 23 ప్రాథమిక సంస్కరణల్లో 19పై ఏకాభిప్రాయం, నిర్ణయాలు కుదిరినట్లు తెలుస్తోంది. 8 అంశాలపై అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయం వచ్చిందని, 11 అంశాలపై భిన్నాభిప్రాయాలు వచ్చినట్లు అక్కడి మీడియా పేర్కొంది. కాగా, గతేడాది ఆగస్టు 05న షేక్ హసీనా తన ప్రధాని పదవికి రాజీనామా చేసి, బంగ్లాదేశ్ నుంచి ఇండియా పారిపోయి వచ్చింది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థుల ఉద్యమం హింసాత్మకంగా మారడంతో ఆమె దేశాన్ని వదలాల్సి వచ్చింది. దీంతో ఆమె ప్రత్యేక విమానంలో భారత్ చేరిన విషయం తెలిసిందే.

# సెలవుపై ఇంటికి వచ్చిన జవాన్‌పై కాల్పులు



న్యూఢిల్లీ-02 ఆగస్ట్-తరంగాలు
సెలవుపై ఇంటికి వచ్చిన జవాన్ పై కాల్పులు జరిగిన సంఘటన హర్యానాలోని సోనిపట్ జిల్లాలో జరిగింది. ఖేరి దమ్కన్ గ్రామానికి చెందిన 30 ఏళ్ల కృష్ణన్ కుమార్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) జవాన్. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో అతడు విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజుల కిందట సొంత గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కన్వర్ యాత్ర కోసం హరిద్వార్ చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఆర్పీఎఫ్ జవాన్ కృష్ణన్, వారి మధ్య ఘర్షణ జరిగింది. ఈ గొడవ తర్వాత కృష్ణన్ సెలవుపై తన గ్రామానికి వచ్చాడు. జూలై 28న తెల్లవారుజామున ఇంటికి వెళ్తున్న అతడిపై కారులో వచ్చిన కొందరు వ్యక్తులు కాల్పులు జరిపి హత్య చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయారు. మరోవైపు సీఆర్పీఎఫ్ జవాన్ హత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. కన్వర్ యాత్ర కోసం హరిద్వార్ వెళ్లి కృష్ణన్‌తో గొడవ పడిన గ్రామానికి చెందిన వ్యక్తులు అతడ్ని చంపినట్లు దర్యాప్తులో తెలుసుకున్నారు. కారు డ్రైవర్ సాగర్, ప్రవీణ్ అలియాస్ మెంధక్, మోహిత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితులు నిషాంత్, అజయ్ పరారీలో ఉన్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. సీఆర్పీఎఫ్ జవాన్ కృష్ణన్‌తోపాటు ఆనంద్ అలియాస్ పహియా అనే మరో వ్యక్తిని కూడా కాల్చి చంపేందుకు నిందితులు ప్లాన్ వేసినట్లు వెల్లడించారు.

# ట్రంప్‌కు నోబెల్ ప్రైజ్ ఇవ్వాలా..?

## -భారత్ సమాధానం ఇదే

న్యూఢిల్లీ-02 ఆగస్ట్-తరంగాలు
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాల్సిందేనని అధ్యక్ష భవనం వైట్‌హౌస్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈజిప్ట్-ఇథియోపియా మొదలుకొని తాజాగా థాయ్‌లాండ్ కాంబోడియాల మధ్య యుద్ధాన్ని ఆపి శాంతి నెలకొల్పేందుకు తీవ్రంగా కృషి చేశారని.. అందుకు అధ్యక్షుడికి కచ్చితంగా నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాల్సిందేనని వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లివెట్ గురువారం డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి అంశంపై భారత్ తాజాగా స్పందించింది. ట్రంప్‌కు నోబెల్ ఇవ్వాలా..? వద్దా..? అనే ప్రశ్నను వైట్‌హౌస్‌నే అడగాలని పేర్కొంది. ట్రంప్‌నకు నోబెల్ శాంతి ఇవ్వాలా..?



అంటూ విలేకరుల ప్రశ్నకు విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఆసక్తికరంగా సమాధానం ఇచ్చారు. 'ఈ ప్రశ్నను మీరు వైట్‌హౌస్‌నే అడుగుతే మంచిదని నా అభిప్రాయం' అంటూ పేర్కొన్నారు.

**నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ అర్హుడే..**

వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లివెట్ గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ అన్నివిధాలా అర్హుడేనని అన్నారు. ఈజిప్ట్-ఇథియోపియా మొదలుకొని తాజాగా థాయ్‌లాండ్ -కాంబోడియాల దాకా.. తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సగటున నెలకు ఓ యుద్ధాన్ని నిలువరించారని కరోలిన్ చెప్పారు. దాడులు, ప్రతిదాడులతో రగిలిపోతున్న దేశాలను ఆయన శాంతింపజేశారని వివరించారు. ఆయా దేశాల అధ్యక్షులు, ప్రధాన మంత్రులకు ఫోన్‌చేసి యుద్ధం ఆపేయాలని హెచ్చరించారని తెలిపారు. దాంతో పలు దేశాల మధ్య యుద్ధాలు ఆగిపోయాయని చెప్పారు. ట్రంప్ జోక్యంవల్లే థాయ్‌లాండ్-కాంబోడియా, ఇజ్రాయెల్ ఇరాన్, రువాండా -కాంగో (డీఆర్సీ), ఇండియా-పాకిస్థాన్, సెర్బియా-కొసావో, ఈజిప్ట్-ఇథియోపియా దేశాల మధ్య యుద్ధాలు ఆగాయని కరోలిన్ అన్నారు. ట్రంప్ జోక్యం చేసుకోకుంటే ఈ యుద్ధాలవల్ల భారీ మొత్తంలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించేదని ఆమె పేర్కొన్నారు. ప్రపంచ దేశాల మధ్య ఉద్రిక్తతలను చల్లార్చి శాంతిని నెలకొల్పిన ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.

# మరోసారి వడ్డీ రేట్ల తగ్గింపు..!

## -ఆర్‌బిఐ పావు శాతం తగ్గించొచ్చు
## -ఎస్‌బిఐ అంచనా

ముంబయి 02 ఆగస్ట్-తరంగాలు
అధిక వడ్డీ రేట్లను క్రమంగా ఉపశమనం లభించే సంకేతాలు కనబడుతున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఆగస్టు 4 నుండి 6 వరకు నిర్వహించనున్న మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) సమావేశంలో రెపోరేటును 25 బేసిస్ పాయిట్లు తగ్గొంచొచ్చని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) అంచనా వేసింది. మరో పావు శాతం తగ్గింపు ద్వారా దీపావళి ముందు రుణ వృద్ధికి మద్దతును ఇచ్చే అవకాశాలున్నాయని పేర్కొంది. ఇంతక్రితం జూన్‌లో జరిగిన ఎంపిసి సమీక్షలో కీలక రెపోరేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించడం ద్వారా రెపోరేటును 5.50 శాతానికి చేర్చింది. ఫిబ్రవరిలోనూ 25 బేసిస్ పాయింట్లు, ఏప్రిల్‌లో 25 బేసిస్ పాయింట్లు చొప్పున వడ్డీ రేట్లను తగ్గించింది. మొత్తంగా రుణాలపై వడ్డీ ఒక్క శాతం మేర కోత విధించడంతో పాత, కొత్త



గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణగ్రహీతలకు కొంత వడ్డీ భారం తగ్గింది. కాగా పలు ప్రయివేటు బ్యాంక్‌లు ఈ ప్రతిఫలాలను ఖాతాదారులకు బదిలీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నాయనే రిపోర్టులు వచ్చాయి."ఆర్థిక సంవత్సరం 2025-26లో పండుగ సీజన్ కూడా ముందస్తుగా ఉండటం వల్ల ఈ నిర్ణయం మరింత ప్రభావవంతంగా ఉండొచ్చు. ఇది వరకు దీపావళి ముందు రేటు తగ్గింపు జరిగినప్పుడు పండుగ సీజన్‌లో రుణ వృద్ధి భారీగా పెరిగింది. 2017 ఆగస్టులో 25 బేసిస్ పాయింట్ల తగ్గింపు తర్వాత దీపావళి నాటికి రూ.1,95,600 కోట్ల అదనపు రుణాల జారీ నమోదయ్యింది. ఇందులో 30 శాతం వ్యక్తిగత రుణాలు చోటు చేసుకున్నాయి." అని ఎస్‌బిఐ నివేదిక తెలిపింది. ద్రవ్యోల్బణం మరింత తగ్గే వరకు లేదా ఆర్థిక వృద్ధి స్పష్టంగా మందగించే వరకు రేటు తగ్గింపును వాయిదా వేయడం వ్యవస్థకు దీర్ఘకాలిక నష్టాన్ని కలిగిస్తుందని ఎస్‌బిఐ పేర్కొంది. వేచి ఉండడం వల్ల ప్రయోజనం తక్కువని.. చర్య తీసుకోకపోవడం వల్ల ఉత్పత్తి, పెట్టుబడి విశ్వాసానికి నష్టమని తెలిపింది.

# ఈనెల16 నుంచి అమృత్ ఉద్యాన్ సందర్శన

న్యూఢిల్లీ-02 ఆగస్ట్-తరంగాలు
ఆగస్టు 16వ తేదీ నుంచి సెప్టెంబర్ 14వ తేదీ వరకూ రాష్ట్రపతి భవన్‌లోని అమృత్ ఉద్యాన్ ను ప్రజల సందర్శనార్థం తెరిచి ఉంచనున్నట్లు రాష్ట్రపతి భవన్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సందర్శకులకు అనుమతి ఉంటుందని, అమృత్ ఉద్యాన్ నిర్వహణ నిమిత్తం ప్రతి సోమవారం సెలవు ఉంటుందని తెలిపాయి. అమృత్ ఉద్యానవనాన్ని సందర్శించాలనుకునేవారు ఆన్లైన్, ఆఫ్ లైన్లలో పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఆన్లైన్లో రాష్ట్రపతి భవన్ అధికారిక వెబ్ సైట్లో, ఆఫ్ లైన్లో 35వ ఎంట్రీ వద్దకు చేరుకున్నాక స్లాట్ బుక్ చేసుకోవచ్చు.



తరంగాలు జాతీయ దిన పత్రిక RNI . TELTEL / 2022 / 83463 Tharangalu Daily News Paper

# అమెరికా 'ఆర్థికపెత్తనం'పై మోడీ మౌనం వీడాలి.

- జాతీయసంఘాల ఆధ్వర్యంలో క్విట్ ఇండియా పిలుపు..
- ఇష్టరాజ్యంగా సుంకాల విధింపు దేనికి సంకేతం..
- ప్రపంచ దేశాలపై అమెరికా ఆదిపత్యం వ్యతిరేకించాలి.
- దేశంలో రైతు పరిస్థితి దారుణంగా తయారైంది.
- ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో దశలవారీ ఉద్యమం
- మీడియా సమావేశంలో రాష్ట్ర నాయకులు వీ కోటేశ్వరరావు.



**పాలేరు ఆర్సీ,03 ఆగస్టు ( తరంగాలు) :** ప్రపంచ దేశాలపై అమెరికా ఆర్థికపెత్తనం చెలాయిస్తుందని, భారతదేశంపై 25శాతం సుకాలు విధించడం అందులో భాగమేనని, దానిని వ్యతిరేకించాల్సిన ప్రధాని మోడీ మౌనం వీడాలని అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వీ కోటేశ్వరరావు అన్నారు. శనివారం కూసుమంచి మండలం పాలేరు గ్రామంలోని బీవీరెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో అమెరికా దేశం 100 దేశాల మీద విధించిన సుంకాలకు వ్యతిరేకంగా ఆగస్టు 13న ఎస్కేయం ఆధ్వర్యంలో క్విట్ ఇండియా కార్యక్రమానికి పిలుపు ఇస్తున్నట్లు కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందుతున్న దేశాల మీద అమెరికా దేశం ముఖ్యంగా భారతదేశం మీద 25 శాతం సుంకం విధించిందని దీనివలన మన దేశం లక్షల కోట్ల రూపాయల ఆదాయం కోల్పోతాం అన్నారు. ముఖ్యంగా నూతనవ్యవసాయ మార్కెట్ విధానం వలన రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు రాకుండా కేంద్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో రద్దు చేసిన మూడు రకాల చట్టాలను వేరే రూపంలో తిరిగి అమలు చేస్తుందని, ఇది అమలైతే రైతులకు చాలా నష్టం జరుగుతుందని తెలిపారు. అందుకే ఆగస్టు 5 నుండి 13 వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమెరికా దేశ అంతర్జాతీయ సుంకాలకు వ్యతిరేకంగా కలిసి వచ్చే శక్తులతో కలుపుకొని పోరాటం ఆగస్టు 13న జరిగే క్విట్ ఇండియా డే ను జయప్రదం చేయాలని తెలిపారు. ఇంకా ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో భారతదేశంలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిందని, దీనికి వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు 13 నెలలు చేసిన ఆందోళనకు భయపడిన ప్రభుత్వం మూడు రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కు తీసుకుందని, మళ్లీ తిరిగి దానినే వేరే రూపంలో ముందుకు తీసుకొస్తుందని దీనిని భారత దేశంలో రైతాంగం అర్థం చేసుకుందని దానికి వ్యతిరేకంగా పోరాటానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో యూరియా కొరత ఉన్న రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్న పట్టించు కోవడంలేదని అసలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలో ఎంత మంది రైతులు ఎన్ని లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారని లెక్కలు వేయకుండా యూరియా కొరత సృష్టిస్తున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొత్తం వ్యవసాయాన్ని అంచినా చేసి తగిన విధంగా యూరియా కొరత లేకుండా అందించాలని కోరారు. అంతేకాకుండా టైగర్ జోన్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అనేకమంది ప్రజలను ఖాళీలు చేయిస్తున్నాయి. దీని వెంటనే ఆపాలని, ఉపాధి హామీ పథకంలో సరైన ఏర్పాట్లు చేయకుండా పనిచేసిన వారికి నిధులు ఆలస్యం చేస్తున్నారని రోజుకు ఆరు వందల రూపాయల కూలీ గిట్టుబాటు అయ్యే విధంగా కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు బ్యాంకు రుణాలు బేషరతుగా ఇవ్వాలని రైతులకు అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ముఖ్యంగా కౌలు రైతులని ఆదుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం వైఫల్యం చెందిందని సాధారణ రైతులకు వర్తించే పథకాలు అన్నిటిని కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌని ఐలయ్య, డేవిడ్ కుమార్, బజ్జూరి వెంకటరామిరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు బందారు ఐలయ్య, నందగిరి వెంకటేశ్వర్లు, తుపాకుల నాగేశ్వరావు, వేల్పూర్ భూమయ్య, గుజ్జ దేవేందర్, జీ సకురు, జడ సత్యనారాయణ, ఎస్కే కాసిం, రాజేంద్రప్రసాద్, వై ప్రకాష్, కలకొండ సురేష్, ఎం గిరి, ఎస్ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 6న వంటలు బంద్.

-ఎంఈఓ కు సమ్మె నోటీసు అందజేత.
- వంట కార్మికులను తొలగించకుండా ఉత్తర్వులు జారీ చేయాలి : విజయలక్ష్మి.



**పాలేరు ఆర్సీ,02 ఆగస్టు ( తరంగాలు) :** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల సాధనకై రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 6 వ తేదీన వంటలు బంద్ చేసి కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి వంట కార్మికులు తరలిరావాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి అన్నారు. ఈ మేరకు శనివారం కూసుమంచి మండల విద్యాశాఖ అధికారి రాయల వీరస్వామికి కార్మికులతో కలిసి సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం ఎంఈఓ తో సమావేశమై మండలంలో వంట కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో వంట కార్మికురాలుపై హెచ్ఎం ఆరోపణలు చేయడంతో కార్మికురాలతో మాట్లాడి ఉపాధ్యాయుడి పై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ ను డిమాండ్ చేశారు. ఈశ్వరమాదారం ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను ఎలాంటి కారణాలు లేకుండా తొలగించారని వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పథకంలో పనిచేస్తున్న వంట కార్మికులను రాజకీయ ఇతరత్రా కారణాలవల్ల తొలగిస్తున్నారని అలా తొలగించకుండా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని అన్నారు. వెంటనే పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలని అన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సంఘం మండల అధ్యక్షురాలు నెల్లూరు కోటమ్మను పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి గుండెపంగు మల్లేష్, సంఘం మండల కార్యదర్శి మండవ కృష్ణకుమారి పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యుల సేవా కార్యక్రమాలు భేష్




**ంజఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 2,(తరంగాలు):** మండలంలోని వేల్పుగొండ లక్ష్మి నరసింహ స్వామి సన్నిధిలో ఆర్యవైశ్యులు గత మూడు సంవత్సరాలుగా చేపట్టుచున్న సేవా కార్యక్రమములు శ్లాఘనీయమని జనగాం జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి గన్ను నరసింహులు పేర్కొన్నారు.జఫర్గడ్ లోని పడమర కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకునేందుకు ప్రతి శ్రావణమాసంలో భక్తులు పెద్ద ఎత్తున వస్తుంటారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం జఫర్గడ్ మండల ఆర్యవైశ్యులు అన్నదాన కార్యక్రమమును ఏర్పాటు చేస్తున్నారు. శనివారం వెయ్యి మంది భక్తులకు అన్నదాన కార్యక్రమమును చేసారు. ఈ కార్యక్రమంలో అన్నదాన కమిటీ అధ్యక్షుడు చిట్టెముల కృష్ణమూర్తి కార్యందర్శి రాజయ్య, కోశాధికారి శ్రవణ్ కుమార్,కార్యవర్గ సభ్యులు నాగరాజు,హరి శంకర్, దొడ్డ.రమేష్, పూర్ణచందర్ సోమేశ్వర్ రాజ్ కుమార్, రేవూరి శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యుగేందర్,కార్యదర్శి సోమేశ్వర్, కోశాధికారి అశోక్,సుధీర్ పట్టూరి రవి, బజ్జూరి రాజు, పల్ల సుధాకర్,బజ్జూరి రాజు,దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన బిడ్డకు డాక్టరేట్ అవార్డు..



**పాలేరు ఆర్సీ ,02 (తరంగాలు ).** ఇంగ్లీష్ మరియు విదేశీ భాషల విశ్వవిద్యాలయం హైదరాబాద్, హిస్పానిక్ అధ్యయనాల విభాగంలో పరిశోధక విద్యార్థి హలావత్ రాజేష్ S/O చిన్న బిక్షం, కోక్యతండ గ్రామం కూసుమంచి మండలం ఖమ్మం జిల్లాకు చెందిన గిరిజన బిడ్డకు డాక్టరేట్ అవార్డును ప్రకటించింది. స్పానిష్ భాషలో లాటిన్ అమెరికా మరియు భారతదేశం (తెలుగు) నుండి ఎంచుకున్న నవలల పర్యావరణ విమర్శనాత్మక విశ్లేషణ: ఒక తులనాత్మక అధ్యయనం అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను రాజేష్ కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఇంగ్లీష్ మరియు విదేశీ భాషల విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు. ఇంగ్లీష్ మరియు విదేశీ భాషల విశ్వవిద్యాలయంలో స్పానిష్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అశ్వని కుమార్ పర్యవేక్షణలో రాజేష్ తన పిహెచ్ డి పూర్తి చేశారు. ఇతను ఈ విభాగం నుండి వచ్చిన మొదటి తెలుగు పరిశోధక విద్యార్థి. ఆ విభాగం హెచ్ఓడి టి. వాణి మాట్లాడుతూ... రాజేష్ పరిశోధన గూర్చి తమ విభాగం చాలా గర్వపడుతుందని, ఆయన పరిశోధనను కొనియాడారు, మరియు తమ శుభాకాంక్షలు తెలియజేశారు. తదుపరి గ్రామ, మండల వసూలు హలవత్ శంకర్ నాయక్, హలావత్ నాగేశ్వరరావు, హలవత్ కృష్ణ, భానోత్ సైదా నాయక్, హలావత్ నరసింహ నాయక్, హలావత్ చాంప్ల, మహమ్మద్ రఫీ పలువురు అభినందించారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన ఆదర్శ పాఠశాల విద్యార్థులు



**జఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 2,(తరంగాలు)** గత నెల జూలై 28వతారీఖున జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్ లో జఫర్గడ్ మోడల్ స్కూల్ విద్యార్థులు టి.చరణ్ టి.విజయ్ మంచి ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సెలెక్ట్ అయ్యారని జఫర్గడ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ కె శ్రీకాంత్ తెలిపారు. జిల్లా స్థాయిలో టి.చరణ్ 600 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం మరియు టి.విజయ్ 1000 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం సాధించారు.ఈనెల 3 4 తేదీలలో హనుమకొండలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరగబోయే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటారు. విద్యార్థుల ఎంపిక పట్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే శ్రీకాంత్ పిఈటిలు బి రాజు, ఏ శ్రీనాథ్, ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు అందరూ విద్యార్థులు అభినందించారు.

# 72 గంటల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రిలే దీక్షను విజయవంతం చేయాలి

యూనిటెడ్ ఫూలే ఫ్రంట్ నాయకులు గోరిగే నర్సింహ కురుమ,గందసిరి వేణు




**మహబుబాబాద్, ప్రతినిధి,ఆగష్టు. 02, (తరంగాలు)** మహబుబాబాద్ జిల్లా తెలంగాణ జాగృతి నాయకులు గందసిరి వేణు మరియు గిరగాని శ్యామ్ గౌడ్ అధ్యక్షున జరిగిన బిసి బిల్లు 42శాతం ప్రవేశపెట్టాలని ఆమోదం తెలపాలని డిమాండ్ తో తెలంగాణ జాగృతి అధ్వర్యంలో తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇందిర పార్క్ వేదికగా 72 గంటల రిలే నిరాహారదీక్షను విజయవంతం చేయాలని సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా యూనిటెడ్ ఫూలే ఫ్రంట్ రాష్ట్రకో కన్వీనర్ గోరిగే నర్సింహ కురమ హాజరై మాట్లాడుతూ ఆగష్టు 4,5, 6,7 జరుగు 72గంటల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇందిరా పార్క్ వేదికగా జరుగుతున్న నిరహార దీక్షను విజయవంతం చేయాలని అన్నారు.రాష్ట్ర లో కాంగ్రెస్,బిజేపీ బీసీ బిల్లు అమలు కాకుండా రాజకీయాలు చేస్తున్నారని, వెంటనే బిసి బిల్లు 42శాతం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.బిసి బిల్లు ప్రవేశపెట్టని యెడల, రాష్ట్ర ప్రభుత్వం పై కేంద్ర ప్రభుత్వం పై మరో ఉద్యమానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సంగెం,హర్షిత్,గోపు సదనంద్,సతిష్,వెంటే శ్రీనువాస్, కరికే,కర్ణకర్, ధర్మరపు పవణ్,పెర్ల గణేష్, ములకల నరేష్, రాజేష్, వేణు, ప్రసాద్,దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బోధనా ప్రణాళికలను రూపొందించుకొని పాఠ్య బోధన చేయాలి...

మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి..



**మహబూబాబాద్, ప్రతినిధి, కేసముద్రం, ఆగస్టు 02, (తరంగాలు)** ఉపాధ్యాయులు ప్రణాళికలు రూపొందించుకొని తదనుగుణంగా పాఠ్య బోధన చేయాలని కేసముద్రం మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి అన్నారు. కాంప్లెక్స్ సమావేశాలలో భాగంగా శనివారం తాళ్లపూసపల్లి జడ్పీ హైస్కూల్ నందు సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులకు, కేసముద్రం విలేజ్ జడ్పీ హైస్కూల్ నందు భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు.ఆయా కాంప్లెక్స్ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ కాలేరు యాదగిరి మాట్లాడుతూ...కాంప్లెక్స్ సమావేశాలలో నేర్చు కున్న విషయాలను పాఠశాలలో ఉపయోగించి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని అన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకే సమాజంలో చక్కని గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ గుర్తింపు హాజరు పట్ల ఉపాధ్యాయులకు నిర్లక్ష్యం తగదని,ప్రతి ఉపాధ్యాయుడు విధిగా ఎఫ్ ఆర్ ఎస్ యాప్ లో ముఖ గుర్తింపు హాజరు వేయాలని మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చీకటి వెంకట్రాం నరసయ్య, తాళ్ళపూస పల్లి జడ్పీ హైస్కూల్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యా యులు దేశ బోయిన వెంకన్న, ఆర్పీలు సునీత, శ్రీనివాస్ రెడ్డి, మధుకర్ తో పాటు పలువురు ఉపాధ్యాయ, ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారులకు శాశ్వత పరిష్కారం చూపాలి



**నర్సంపేట ఆగస్టు 03 తరంగాలు :**
నర్సంపేట పట్టణంలోని రోడ్డు ప్రక్కన పండ్లు మరియు కూరగాయలు అమ్ముకొని జీవనం సాగిస్తున్న వీధి వ్యాపారులకు శాశ్వత పరిష్కారం చూపాలని బిజెపి పట్టణ పార్టీ అధ్యక్షుడు గూడూరు సందీప్ కోరారు. ఈ సందర్భంగా శనివారం భారతీయ జనతా పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు మెమోరాండం అందజేశారు ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా రోడ్డుపైన వీధి వ్యాపారం చేస్తున్న పండ్ల మరియు కూరగాయల దుకాణాలకు శాశ్వతమైన పరిష్కారం చూపించాలని అట్టి షాపులను కోర్టు ప్రహరీ గోడను 10 ఫీట్లు సెట్ బ్యాక్ జరిపి ఇవ్వాలని లేదా నిరుపయోగంగా ఉన్న అగ్రికల్చర్ గోదాముల దగ్గరికి మార్చేలా చూడాలని లేదంటే ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముందు ఉన్న ప్రహరీ గోడను సెట్ బ్యాక్ చేసి ఇవ్వాలని లేదా బస్టాండ్ ఆవరణంలో నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని పండ్ల షాపులకు కేటాయించి వారికి జీవన ఆధారం కోల్పోకుండా శాశ్వత పరిష్కారం చూపాలని మరియు కూరగాయల వ్యాపారులకు సంబంధించిన వీధి వ్యాపారుల అందరిని ఒక దగ్గరికి తీసుకొని వచ్చి అంగడిలో ఏర్పాటు చేసినటువంటి బిల్డింగులో వారికి స్థలం కేటాయించి వీధి వ్యాపారులు రోడ్డు మీద పడకుండా చూడాలని కోరారు దుకాణ సముదాయాలలో మీరు చేసే సెట్ బ్యాక్ ఏదైతే ఉందో ధనవంతుల మరియు రాజకీయ ఒత్తిడి లకు లొంగకుండా చేయాలని కోరారు ఎలాంటి రాజకీయ ఒత్తిడిలు లేకుండా కంకణ బద్ధులై ఉన్నటువంటి నర్సంపేట మున్సిపల్ అధికారులు నర్సంపేట రూపురేఖలు మరియు డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా ఆధునికరించేలా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ నాయకులు జూలూరి మనీష్ గౌడ్ యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్ సీనియర్ నాయకులు ఠాకూర్ శివంజన్ సింగ్ నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షుడు కాసుల నాగేంద్రబాబు ఠాకూర్ విజయ్ సింగ్ కందగట్ల నాగరాజు కార్యదర్శి నరేష్ శివ కోశాధికారి నిశాంత్ యువమోర్చా జిల్లా కార్యదర్శి చిలువేరు అన్వేష్ మరియు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భాధితులకు సంఘం నాయకుల 20వేల ఆర్ధిక సహాయం



**మహబూబాబాద్,ప్రతినిధి, కేసముద్రం, ఆగస్టు. 02, ( తరంగాలు)**
కేసముద్రం మండల టాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘం మాజీ సభ్యులు కోమటిరెడ్డి రామకృష్ణారెడ్డి అకాల మరణం చెందడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు చిలుముల మహేష్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి 20వేల రూపాయల ఆర్థిక సహాయం చేయడం జరిగింది. అలాగే యూనియన్ సభ్యులంతా వారికి ఎప్పుడు ఏ అవసరమైన ఉన్నామని మనోధైర్యాన్ని కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చిలుముల మహేష్, ఉపాధ్యక్షులు పింగిలి సంతోష్,కోశాధికారి నాగన్న, బోయిన నర్సయ్య,కార్యవర్గ సభ్యులు సిలువేరు గణేష్, సభ్యులు గాడి పెల్లి సంతోష్ రావుల అనిల్ లు పాల్గొనడం జరిగింది.

## ముర్రుపాలె బిడ్డకు శ్రేష్టం...

ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ...



**మహబూబాబాద్ ప్రతినిధి కేసముద్రం, ఆగస్టు 02, (తరంగాలు)**
తేనె వద్దు... తీర్థం వద్దు.. ముర్రుపాలే బిడ్డకు శ్రేష్టం అని ఐసిడిఎస్ సూపర్వైజర్ కె.విజయ అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఈనెల 1వ, తేదీ నుండి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం కేసముద్రం స్టేషన్ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఐసిడిఎస్ సూపర్వైజర్ కె.విజయ మాట్లాడుతూ.. ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని,బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టిస్తే బిడ్డకు జీవితాంతం రక్షణ ఉంటుందని తెలిపారు. ప్రసవించిన వెంటనే, గంటలోపే తల్లులు బిడ్డకు తప్పనిసరిగా పాలు పట్టించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ కె. విజయ తల్లులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఈ. రాజమణి, ఆయా అరుణ తోపాటు పలువురు పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## చంద్రు తండా ను సందర్శించిన జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ సుబ్బారావు.



**పాలేరు ఆర్సీ, 02 ఆగస్టు (తరంగాలు).**



తిరుమలాయపాలెం మండల పరిధిలోని చంద్రు తండాలో డెంగ్యూ కేసులు ఉన్న నేపథ్యంలో గత వారం రోజుల నుండి క్యాంపులు నిర్వహిస్తున్న సందర్భంగా పరిస్థితులను పర్యవేక్షించేందుకు ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేసినారు.చంద్రు తండ గ్రామంలో డెంగ్యూ కేసులు ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రమోత్తంగా ఉండాలని వీధులను పరిశుభ్రంగా ఉంచాలని దోమలు నిలవ ఉండకుండా వీధుల వెంట సైడ్ కాలువలు వెంబడి బ్లీచింగ్ చెల్లించాలని దోమలు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి తక్షణమే తొలగించాలని ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు ఆశా వర్కర్లు పనితీరును పరిశీలించి సీజనల్ వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ స్పందించాలని వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని డెంగ్యూ వ్యాధికిట్లు సరిపడా ఆశా వర్కర్లు దగ్గర ఉంచుకోవాలని సూచించారు.సుప్లేడు పిహెచ్సి ని సందర్శించి అక్కడ అందుతున్న వైద్యశాల గురించి ఆరా తీసినారు వైద్యుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యాధులకు సరిపడా మందులు తెప్పించుకొని హాస్పిటల్లో సిద్ధంగా ఉంచుకోవాలని ఏదైనా కొరత ఉండి ఉంటే పై అధికారులకు తెలియపరచాలని మీకు ఏమీ అవసరాలు ఉంటాయో అవసరాలకు అనుగుణంగా అన్ని సిద్ధం చేసుకుని ఉండాలని సూచించడం జరిగింది ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి నిర్మూలన అధికారి వరికుటి సుబ్బారావు సుబ్లేడ్ పిహెచ్సి డాక్టర్ వసుంధర, ఏఎన్ఎంలు, ఆశాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాఠశాలలో విద్యార్థులకు సంచాయిక పొదుపు పథకం




**జఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 2, ( తరంగాలు):**




మండలంలోని తిమ్మంపేట గ్రామం లోజిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల లో సంచాయిక పొదుపు పథకంలో భాగంగా 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకై తిమ్మంపేట పాఠశాల బ్యాంక్ శనివారం రోజున పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామెర షారోన్,సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుని నాగుల లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయుల సహకారంతో ప్రారంభించబడింది. ఈ సందర్భంగా పొదుపు యొక్క ఆవశ్యకత, డబ్బు నిర్వహణ, ఆర్థిక క్రమశిక్షణ పొదుపు ద్వారా భవిష్యత్తు అవసరాలు ఎలా తీరుతాయో విద్యార్థులకు వివరించారు ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## సీఎంఆర్ బియ్యాన్ని మిల్లింగ్ చేసి డెలివరీ చేయాలి



**మహబూబాబాద్., ప్రతినిధి, కేసముద్రం, ఆగస్టు.02, (తరంగాలు)**
మహబూబాబాద్ జిల్లాలోని సిఎంఆర్ త్వరితగతిన మిల్లింగ్ చేసి డెలివరి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్ మిల్లర్లకు ఆదేశించారు.మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం కి సంబందించిన మిల్లులను 1) ఓం సాయి ఆగ్రో ఇండస్ట్రీస్ 2)శ్రీ శివ రామ రైస్ ఇండస్ట్రీస్ మరియు కేసముద్రం గిడ్డంగిని జిల్లా అదనపు కలెక్టర్ సందర్శించారు.మిల్లులలో దిగుమతి అయిన వరి ధాన్యం రబీ 2024-25 కు సంబంధించి నిల్వలను మరియు సీఎంఆర్ పెట్టిన దాని గురించి తనిఖి చేసి రైస్ మిల్లర్లకి సీఎంఆర్ (బియ్యం) త్వరితగతిన పెట్టుటకు ఆదేశాలు ఇవ్వటం జరిగింది.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తో పాటుగా పౌర సరఫరాల అధికారి మరియు జిల్లా మేనేజర్,పౌర సరఫరాల సంస్థ అధికారులు పాల్గొనటం జరిగింది.

## ఉత్సాహంగా గ్రీన్ ఇండియా క్లీన్ ఇండియా డ్రీమ్ ఇండియా అవగాహన సదస్సు





**ఆమనగల్లు,ఆగస్టు 2, తరంగాలు:**



పర్యావరణ పరిరక్షణ సమితి చెట్టు - అమ్మ ఆధ్వర్యంలో "గ్రీన్ ఇండియా, క్లీన్ ఇండియా, డ్రీమ్ ఇండియా" ప్రాజెక్ట్‌కు సంబంధించిన అవగాహన సదస్సు ఆమనగల్లు వివేక విద్యా భారతి స్కూల్‌లో ఘనంగా ప్రారంభమైంది. విద్యార్థుల్లో చైతన్యాన్ని నింపేలా ఈ కార్యక్రమం సాగింది. ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ యూత్ అవార్డు గ్రహీత జి. శివకుమార్ పర్యావరణ పరిరక్షణపై తన అనుభవాలను పంచుకుంటూ, సమాజం పట్ల యువతకు ఉండాల్సిన బాధ్యతను వివరించారు.విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ వనరులపై అవగాహన కల్పిస్తూ, మై భారత్ మరియు మై గవ్ వంటి వెబ్‌సైట్ల ఉపయోగాన్ని వివరించారు. "ఈ వనరులు యువత మేధశక్తిని పెంపొందించేందుకు ఎంతో ఉపయోగపడతాయి" అని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ మహమూద్, కరస్పాండెంట్ శ్రీను, పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు కండె వెంకట్, బొజ్జ నిఖిల్, బాగే శ్రీకాంత్, దిలీప్, సామల సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విద్యానికేతన్ పాఠశాలలో స్నేహితుల దినోత్సవ వేడుకలు

**నల్లబెల్లి, ఆగస్టు 2,తరంగాలు :**



శ్రీ విద్యానికేతన్ హై స్కూల్ నల్లబెల్లిలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆదర్శవాణి విద్యాసంస్థల చైర్మన్ నాగనబోయిన రవి గారు మాట్లాడుతూ మన జీవితాన్ని వెలిగించే గొప్ప బంధం స్నేహం. ఈ ప్రత్యేక దినంలో ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి ఒక్కరి మధ్య అనుబంధాలు మరింత బలపడాలని ఆకాంక్షిస్తున్నాము. స్నేహం పంచుకోదగిన విలువైన బహుమతి. ఈ స్నేహితుల దినోత్సవం ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం అవగాహన అర్థం నింపాలని చక్కగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కవిత బిక్షపతి ప్రిన్సిపల్ మాడిశెట్టి సుధాకర్ మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## నిరుపేద గోపాల్ మేస్త్రి కుటుంబానికి అండగా నిలిచిన డబుల్ బెడ్ రూమ్ కమిటీ



**కల్వకుర్తి.ఆగస్టు 2 తరంగాలు ప్రతినిధి.**
కల్వకుర్తి పట్టణంలోని డబల్ బెడ్ రూమ్ ఫ్యామిలీ అందరూ కలిసి నిరుపేద అయిన గోపాల్ మేస్త్రి కి ఆర్థిక సాయం చేయడం జరిగింది.పూర్తి వివరాలకు వెళ్తే కల్వకుర్తి డబల్ బెడ్ రూమ్ లలో నిరుపేద అయిన గోపాల్ మేస్త్రి వాళ్ళ అమ్మ తేదీ 31/7/2025 నాడు గురువారం నాడు మరణించడం జరిగింది. డబల్ బెడ్ రూమ్ కమిటీ సభ్యులు అందరం కలిసి ఆర్థిక 13.250 సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డబల్ బెడ్ రూమ్ ఫ్యామిలీ అందరూ సహకరించినందుకు గోపాల్ మేస్త్రి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. డబల్ బెడ్ రూమ్ లో ఉన్న వారు మాట్లాడుతూ ఇకమీదట ఎవరు చనిపోయిన అందరూ కలిసి మెలిసి సహాయ సహకారాలు చేసుకుంటామని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు.

## అనారోగ్య సమస్యలతో మహిళ ఆత్మహత్య

**మహబూబాబాద్, ప్రతినిధి, కేసముద్రం, ఆగస్టు., 02,( తరంగాలు)**



కేసముద్రం మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన మల్లూరి నర్సమ్మ(60) భర్త లక్ష్మయ్య పురుగుల మందు శనివారం చోటుచేసుకుంది. కే సముద్రం ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మల్లూరు నరసమ్మ కొన్ని సంవత్సరాలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది.తనను చాలా సార్లు హాస్పిటల్ లో చూపించిన ఆమె ఆరోగ్యం కుదుట పడలేదు.ఆమె ఆరోగ్యం ఎప్పటికీ కుదుటపడదేమోనని తరచు బాధపడుతూ ఉండేది. శనివారం ఉదయం వారి యొక్క వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి రాగా అట్టి విషయాన్ని గమనించిన మృతురాలు నరసమ్మ యొక్క కోడలు వెంటనే అదే ఊర్లో ఉంటున్న నర్సమ్మ యొక్క అల్లుడికి ఫోన్ చేసి వారి యొక్క ఆటోల మహబూబాబాద్ తీసుకొని వస్తూ మార్గమధ్యలో అంబులెన్స్ లో ఎక్కించి మహబూబాబాద్ గవర్నమెంట్ హాస్పిటల్ కు తీసుకువచ్చి చికిత్స చేపించుచుండగా ఉదయం అందాల 11.30. గంటలకు మల్లూరు నరసమ్మ చికిత్స పొందుతూ మరణించడం జరిగింది. ఆమె యొక్క కొడుకు అయినా మల్లూరు యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నమోదు చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు.

## బిజినెస్

### ఎలాన్ మస్క్ టెస్లా కంపెనీకి ఫ్లోరిడా కోర్టు భారీ జరిమానా.. ఎంతంటే..!




అగ్రరాజ్యం అమెరికా కు చెందిన దిగ్గజ ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ కంపెనీ టెస్లా కు ఫ్లోరిడా కోర్టు భారీ జరిమానా విధించింది. 2019లో జరిగిన ఒక రోడ్డు ప్రమాదానికి సంబంధించి అప్పట్లో టెస్లా కంపెనీ పై కేసు నమోదైంది. టెస్లా కారులోని ఆటో పైలట్ వ్యవస్థ లో లోపంవల్లే ఆ ప్రమాదం జరిగిందని తాజాగా ఫ్లోరిడా కోర్టు తేల్చింది. బాధిత కుటుంబానికి 240 మిలియన్ డాలర్ల పరిహారం (భారత కరెన్సీలో సుమారుగా రూ.1,996 కోట్లు) చెల్లించాలని టెస్లాను ఆదేశించింది.వివరాల్లోకి వెళితే.. ఫ్లోరిడాలోని కీ లార్గోలో 2019 లో ఒక రోడ్డు ప్రమాదం జరిగింది. జార్జ్ మెక్ గీ అనే వ్యక్తి తన టెస్లా కారులో వెళు తూ అత్యాధునిక ఆటో పైలట్ ఫీచర్‌ను ఉపయోగించాడు. ఇది టెస్లా అందించిన ఆటోమేటెడ్ డ్రైవింగ్ వ్యవస్థ. మార్గమధ్యంలో జార్జ్ మొబైల్ కారులో కింద పడిపోయింది. కారు ఆటో పైలట్ మోడ్‌లోనే ఉండటంతో జార్జ్ కిందకు వంగి ఫోన్ తీసుకునేందుకు ప్రయత్నించాడు. దాంతో ఆ కారు అదుపు తప్పి పక్కనే పార్క్‌చేసి ఉన్న మరో కారును ఢీకొట్టింది. ఆపై ఇద్దరు వ్యక్తులపైకి దూసుకువెళ్లింది. ఈ ఘటనలో 22 ఏళ్ల యువతి అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై బాధిత కుటుంబాలు కోర్టును ఆశ్రయించాయి. సుదీర్ఘ విచారణ అనంతరం తాజాగా ఫ్లోరిడా కోర్టు తీర్పు వెల్లడించింది. ఈ ప్రమాదానికి నష్టపరిహారంగా బాధిత కుటుంబాలకు మొత్తం 329 మిలియన్ డాలర్లు చెల్లించాలని కోర్టు కారు యజమానిని ఆదేశించింది.అయితే ప్రమాదానికి ఆటో పైలట్ వ్యవస్థ లోపం కూడా ఒక కారణమని గుర్తించిన కోర్టు.. ఆ మొత్తం పరిహారంలో 242 మిలియన్ డాలర్లను టెస్లా కంపెనీ చెల్లించాలని తన ఆదేశాల్లో పేర్కొన్నది. ప్రమాదానికి కారకుడైన కారు యజమాని మిగతా మొత్తం చెల్లించాలని స్పష్టంచేసింది.

# మళ్లీ లక్ష దాటనున్న బంగారం ధర..

బంగారం ధరలకు రెక్కలొస్తున్నాయి. ప్రస్తుతం స్వల్పంగా తగ్గినా తులం ధర లక్ష రూపాయలకు చేరువలో ఉంది. శనివారం ఉదయం 6 గంటల సమయానికి తులంపై కేవలం పది రూపాయలు మేత్రమే తగ్గింది. ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99,810 రూపాయలు ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర 91,490 రూపాయల వద్ద ఉంది. అదే వెండి ధర మాత్రం భారీగా తగ్గింది. గత రెండు రోజులో పోల్చుకుంటే 3 వేల రూపాయల వరకు తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి ధర 1 లక్షా 12,900 రూపాయల వద్ద కొనసాగుతోంది. అయితే హైదరాబాద్, కేరళ, చెన్నైలలో లక్షా 22 వేల వరకు ఉంది.



హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99,810 రూపాయలు ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర 91,490 రూపాయల వద్ద ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99,960 రూపాయలు ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర 91,640 రూపాయల వద్ద ఉంది. ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99,810 రూపాయలు ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర 91,490 రూపాయల వద్ద ఉంది. విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99,810 రూపాయలు ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర 91,490 రూపాయల వద్ద ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99,810 రూపాయలు ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర 91,490 రూపాయల వద్ద ఉంది. కేరళలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99,810 రూపాయలు ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర 91,490 రూపాయల వద్ద ఉంది.

## రెండు కొత్త ఐకాన్‌లను ఆవిష్కరించిన బీఎస్ఏ మోటార్‌సైకిల్స్

హైదరాబాద్

బ్రిటిష్ వారసత్వ బ్రాండ్ అయిన బీఎస్ఏ మోటార్‌సైకిల్స్ తన సరికొత్త బీఎస్ఏ స్క్రాంబ్లర్ 650, బీఎస్ఏ బాంటమ్ 350 లను ఆవిష్కరించింది. 1861 నాటి వారసత్వంలో పాతుకుపోయిన ఆవిష్కరణ, పనితీరు, శైలిని అందించడం ద్వారా ఆధునిక యుగానికి క్లాసిక్ మోటార్‌సైక్లింగ్‌ను తిరిగి ఊహిం చు కోవడాన్ని కొనసాగిస్తున్న బీఎస్ఏ ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది.దశాబ్దాలుగా బీఎస్ఏ బ్రిటిష్ ఇంజనీరింగ్, హస్తకళానైపుణ్యం, రైడింగ్ పరిపూర్ణ ఆనందానికి పర్యాయపదంగా ఉంది. యుద్ధానంతర బ్రిటన్‌లో అసలు బాంటమ్ కీలక పాత్ర పోషించింది. రెండవ ప్రపంచ యుద్ధానంతర తరాన్ని సమీకరించింది. యూకే యొక్క అన్ని కాలాలలో అత్యధికంగా అమ్ముడైన మోటార్‌సైకిల్‌గా మారిం ది. నేడు, బాంటమ్ 350 కొత్త రైడర్‌లకు అదే ప్రాప్యత స్ఫూర్తిని కలిగి ఉంది. అదే విధంగా స్క్రాంబ్లర్ 650ని ప్రవేశపెట్టడం అనేది బీఎస్ఏకు సంబంధించి ఒక సాహసోపేతమైన ముందడుగును సూచిస్తుంది.



కఠినమైన బహుముఖ ప్రజ్ఞను అత్యాధునిక ఇంజనీరింగ్‌తో మిళితం చేస్తుంది -అన్వేషణ, ఇంజనీరింగ్ నైపుణ్యం పట్ల బ్రాండ్ శాశ్వత అభిరుచికి నిదర్శనంగా పనిచేస్తుంది.

**బీఎస్ఏ స్క్రాంబ్లర్ 650: ఒక డైనమిక్ కొత్త అధ్యాయం**

కొత్త BSA స్క్రాంబ్లర్ 650 క్లాసిక్ బ్రిటిష్ డిజైన్‌ను సమకాలీన ఇంజనీరింగ్‌తో మిళితం చేసి, డ్యూయల్-పర్పస్ మోటార్‌సైకిళ్లకు కొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది. బలమైన 652 cc, లిక్విడ్-కూల్డ్ సింగిల్-సిలిండర్ DOHC ఇంజిన్‌తో నడిచే స్క్రాంబ్లర్ 650 6500 rpm వద్ద 45PS, 4000rpm వద్ద కమాండింగ్ 55Nm ఉత్పత్తి చేస్తుంది. దీని 5-స్పీడ్ ట్రాన్స్‌మిషన్, స్లిప్-అండ్-అసిస్ట్ క్లచ్, 41mm టెలిస్కోపిక్ ఫోర్కులు, 5-స్టెప్ అడ్జస్టబుల్ ప్రీ లోడ్‌తో కూడిన ట్విన్ షాక్ అబ్జార్బర్‌లు అన్ని రహదారులపై సరైన సౌకర్యం, నియంత్రణను అందిస్తాయి.

కమాండింగ్ రైడింగ్ ట్రయాంగిల్, వెడల్పు హ్యాండిల్‌బార్స్, లో-డౌన్ టార్క్‌తో, స్క్రాంబ్లర్ 650 పట్టణ ప్రయాణా లకు, గతుకుల రోడ్లపై సాటిలేని చురుకుదనాన్ని అందిస్తుంది. బైక్ ఆకర్షణను విలక్షణమైన రంగులు థండర్ గ్రే, రావెన్ బ్లాక్ మరియు విక్టర్ యెల్లో - అధికం చేస్తాయి. డ్యూయల్-ఛానల్ ABS తో బ్రెంబో బ్రేక్‌లు, గ్రిప్పీ పిరెల్లి స్కార్పియన్ ర్యాలీ ఎస్టీఆర్ టైర్లు, వైర్-స్పోక్ అల్లాయ్ రిమ్ వంటి ప్రీమియం ఫీచర్లు దీని ఆకర్షణ ను పెంచుతాయి. 12-లీటర్ ఇంధన ట్యాంక్, 218 కిలోల బరువు ఏదైనా సాహసయాత్రకు సంసిద్ధతను నిర్ధా రిస్తుంది. 820 mm సీటు ఎత్తు, 1,463 mm వీల్‌బేస్ రోడ్డుపై నమ్మకంగా, కమాండింగ్ వైఖరిని అందిస్తాయి.

# ఒకే జట్టులో షమీ, సూర్యవంశీ.. కెప్టెన్‌గా ఇషాన్..!

భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ దేశవాళీలో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు. మోకాలి గాయం తర్వాత జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన ఈ స్పీడ్‌స్టర్ దులీప్ ట్రోఫీ లో వికెట్ల వేటతో టీమిండియా తలుపు తట్టాలనే కసితో ఉన్నాడు. ఇషాన్ కిషన్ సారథ్యంలో ఈస్ట్ జోన్ తరఫున బరిలోకి దిగనున్నాడు షమీ. ఐపీఎల్‌లో రెండో వేగవంతమైన శతకంతో రికార్డు సృష్టించిన వైభవ్ సూర్యవంశీ , రియాన్ పరాగ్‌లు కూడా స్క్వాడ్‌లో ఉన్నారు.ఐపీఎల్‌తో ఫామ్ అందుకున్న ఇషాన్‌కే ఈస్ట్ జోన్ పగ్గాలు అప్పగించడంతో.. సీనియర్ ప్లేయర్ అభిమన్యు ఈశ్వరన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. స్క్వాడ్‌లోని షమీకి 34 ఏళ్లు కాగా.. వైభవ్‌కు 14 సంవత్సరాలు మాత్రమే. ఇరవై ఏళ్ల వయోభేదం ఉన్న ఈ ఇద్దరూ ఒకే జట్టుకు ఆడుతుండడం విశేషం. అయితే.. రంజీ ట్రోఫీలో నిరుడు బెంగాల్ తరఫున



అత్యధిక రన్స్ బాదిన సుదీప్ చటర్జీని సెలెక్టర్లు పక్కన పెట్టేశారు.

**ఈస్ట్ జోన్ స్క్వాడ్ :** ఇషాన్ కిషన్(కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్(వైస్ కెప్టెన్), సందీప్ పట్నాయక్, విరాట్ సింగ్ డెనిశ్ దాస్ శరందీప్ సింగ్ కుమార్ కుషగ్ర, రియాన్ పరాగ్, ఉత్కర్ష్ సింగ్, మనీషి, సూరజ్ సింధు జైస్వాల్, ముకేశ్ కుమార్, ఆకాశ్ దీప్, షమీ.

**స్టాండ్ బై ప్లేయర్లు :** ముఖ్తర్ హుసేన్, ఆశీర్వాద్ స్వేన్, వైభవ్ సూర్యవంశీ, సాత్విక్ సమాల్, సుదీప్ కుమార్ ఘరమి, రాహుల్ సింగ్.

దేశవాళీ సీజన్ 2025-26 దులీప్ ట్రోఫీతో ప్రారంభం కానుంది. చాలా సీజన్ల తర్వాత ఆరు జోన్లతో నిర్వహిస్తున్న ఈ ట్రోఫీ ఆగస్టు 28న షురూ అవుతుంది. జాతీయ జట్టులో చోటు ఆశిస్తున్న ఇషాన్ కిషన్, షమీలకు ఈ టోర్నీ కీలకం. ఐపీఎల్ 18వ సీజన్‌లో ఇద్దరూ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడారు. కిషన్ మెరుపు సెంచరీతో అదరగొట్టినా.. ఆ తర్వాత తేలిపోయాడు. లీగ్ మ్యాచ్‌ల ఆఖర్లో మళ్లీ ఈ లెఫ్ట్ హ్యాండర్ బ్యాట్ ఝులిపించాడంతే. షమీ విషయానికొస్తే.. ఆరు వికెట్లతో తీవ్రంగా నిరాశపరిచాడు. సో.. డొమెస్టిక్ క్రికెట్‌లో ఫామ్ చాటుకొని.. టీమిండియా జెర్సీ వేసుకోవాలని ఇద్దరూ భావిస్తున్నారు. ఇద్దరికీ ఆల్ ది బెస్ట్ చెబుదామా.

## స్టన్నింగ్ నిర్ణయం తీసుకున్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు

**ఇస్లామాబాద్**

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్‌లో.. పాకిస్థాన్‌తో తలపడేందుకు ఇండియా నిరాకరించిన విషయం తెలిసిందే. ఆ టోర్నీలో పాకిస్థాన్ చాంపియన్స్ జట్టుతో ఇండియా సెమీస్‌లో ఆడాల్సి ఉంది. కానీ ఇటీవల రెండు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో .. పాక్‌తో ఆడేది లేదని ఇండియా నిర్ణయించింది. అయితే ప్రైవేటు లీగ్‌ల్లో ఆడే పాకిస్థాన్ జట్లకు తమ దేశం పేరు పెట్టకుండా ఉండేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నిర్ణయించినట్లు తెలుస్తోంది. టెలికామ్ ఏసియా స్పోర్ట్స్ అనే వెబ్‌సైట్‌లో దీనికి సంబంధించిన కథనం వచ్చింది.బ్రిటన్‌లో జరుగుతున్న డబ్ల్యూసీఎల్‌లో వివాదం చెలరేగడం వల్ల.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆ నిర్ణయం తీసుకున్నది. ప్రైవేటు టోర్నీల్లో ఆడే పాకిస్థాన్ జట్లకు దేశం పేరు లేకుండా ఉండేలా చర్యలు







తీసుకోవాలని పీసీబీ యోచిస్తున్నది. బోర్డు డైరెక్టర్లతో జరిగిన చర్చల్లో దీనిపై నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌తో ఆడేందుకు నిరాకరించడం అంటే తమ దేశానికి చెడ్డ పేరు వస్తుందని పీసీబీ బోర్డు అభిప్రాయపడింది. భవిష్యత్తులో ప్రైవేటు లీగ్‌ల్లో ఆడే ఏ సంస్థకైనా దేశం పేరు పెట్టుకునే అనుమతి ఇవ్వబోమని పీసీబీ నిర్ణయించింది. అయితే ఈ ఆదివారం దక్షిణాఫ్రికాతో జరిగే ఫైనల్లో మాత్రం పాకిస్థాన్ లెజండ్స్ జట్టు యధావిధిగా పోటీపడనున్నది. జింబాబ్వే, కెన్యా, అమెరికా లాంటి దేశాల్లో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో అనేక సంస్థలు పాకిస్థాన్ పేరు వాడినట్లు రిపోర్టు ఉన్నది. ఒకవేళ ప్రైవేటు సంస్థలు దేశం పేరు వాడితే దానిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు పీసీబీ వార్నింగ్ ఇచ్చింది.

## స్పోర్ట్స్

### యశస్వీ, ఆకాశ్, సుందర్ విధ్వంసం.. ఇంగ్లండ్ ఎంత కొట్టాలంటే..?



అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ విజేతను నిర్ణయించే ఓవల్ టెస్టులో సమిష్టిగా రాణించిన భారత జట్టు భారీ స్కోర్ కొట్టింది. ఆతిథ్య జట్టు బౌలర్లను వచ్చినవాళు వచ్చినట్టు ఉతికేయగా.. కొండంత లక్ష్యాన్ని ముందుంచింది. మూడో రోజు ఓపెనర్ యశస్వీ జైస్వాల్(118) సెంచరీకి ఆకాశ్ దీప్ (66) తొలి అర్ధ శతకంతో విరుచుకుపడగా.. టీ సెషన్ తర్వాత రవీంద్ర జడేజా(53 ), వాషింగ్టన్ సుందర్(53 ) విధ్వంసక అర్ధ శతకంతో చెలరేగారు. జడ్డూ వెనుదిరిగాక టెయిలెండర్ల అండతో రెచ్చిపోయిన సుందర్ సిక్సర్లతో దడపుట్టించి జట్టు స్కోర్ 390 దాటించాడు. ధాటిగా ఆడబోయిన అతడు పదో వికెట్‌గా వెనుదిరగగా టీమిండియా ప్రత్యర్థికి 373 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.ఫలితాన్ని తేల్చే ఓవల్ టెస్టులో భారత బ్యాటింగ్ యూనిట్ గొప్పగా రాణించింది. ఒకరిద్దరూ విఫలమైనా.. ప్రత్యర్థికి సవాల్ విసిరే స్కోర్ చేసింది టీమిండియా. ఓవర్ నైట్ స్కోర్ 75/2తో మూడో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ మ్యాచ్‌పై పట్టుబిగించింది. రెండో రోజే మెరుపు బ్యాటింగ్‌తో అర్ధ శతకం బాదేసిన ఓపెనర్ యశస్వీ (118) మూడో రోజు అదే జోరు చూపించాడు. నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన ఆకాశ్(66) నమ్మశక్యంకాని విధంగా క్రీజులో పాతుకుపోయాడు. ఇంగ్లండ్ పేసర్ల ఎత్తుల్ని చిత్తు చేస్తూ యశస్వీ.. స్లిప్‌లో బంతిని బౌండరీ దాటిస్తుంటే ఫీల్డర్లు అయ్యో అని తల పట్టుకుంటున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 107 రన్స్ జోడించి మంచి పునాది వేశారు.

**తొలి హాఫ్ సెంచరీ..**

ఇంగ్లండ్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్న ఆకాశ్ కెరీర్లో తొలి హాఫ్ సెంచరీ బాదాడు. ఓవర్టన్ ఓవర్లో అతడు బౌండరీతో ఫిఫ్టీ సాధించాడు. అతడు ఔటయ్యాక వచ్చిన కెప్టెన్ గిల్ ఎక్కువ సేపు క్రీజులో నిలవలేదు. కరుణ్ నాయర్ సైతం నిరాశపరచగా.. మాంచెస్టర్ హీరో రవీంద్ర జడేజా (53), ధ్రువ్ జురెల్ (34) బాధ్యతగా ఆడారు.ఏడో వికెట్‌కు 50 రన్స్ జోడించి ఆధిక్యాన్ని 300లకు చేరింది. అయితే.. ఆ తర్వాత బంతికే ఓవర్టన్ బౌలింగ్‌లో జురెల్ ఎల్బీగా వెనుదిరిగాడు. అయినా సరే వాషింగ్టన్ సుందర్ (53) జతగా జడేజా భారీ స్కోర్ అందించే పనిలో నిమగ్నమయ్యాడు.

ఆదివారం 3 ఆగస్టు 2025

తరంగాలు
Tharangalu Daily News Paper
RNI : TELTEL / 2022 / 83463



## ఎన్టీఆర్ అన్న కోసం ఆ సినిమా టైటిల్ మార్చుకున్నాం

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ చాలా రోజుల తర్వాత కింగ్‌డమ్ సినిమాతో సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్నాడు. ఈ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం నాగవంశీ నిర్మించాడు. గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో రన్ అవుతుంది. అయితే ఈ సినిమా టైటిల్‌పై ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు విజయ్. ఈ సినిమాకు మొదటగా నాగదేవర 'నాగ దేవర' అనే టైటిల్ అనుకున్నామని అయితే అప్పటికే ఎన్టీఆర్ అన్నా దేవర ప్రకటించడంతో ఈ టైటిల్ వదులుకున్నట్లు విజయ్ చెప్పుకోచ్చాడు.అయితే ఈ సినిమాలో సాంగ్ డిలీట్ చేయడంపై విజయ్ స్పందిస్తూ.. ఆ ఆలోచన తనది కాదని.. దర్శకుడు గౌతమ్.. ఎడిటర్ నవీన్ నూలి కలిసి తీసుకున్న నిర్ణయం అని చెప్పాడు. అయితే ఎందుకు పాటను తొలగించారని ప్రేక్షకుల ఇప్పుడు అడుగుతున్నారు. ఆ పాటను జత చేసే పనిలో మా మేకర్స్ పనిచేస్తున్నారంటూ విజయ్ చెప్పుకోచ్చాడు. విజయ్ అప్‌కమింగ్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నాడు. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుంది. అలాగే రవి కిరణ్ కోలాతో రౌడీ జనార్ధన్ అనే సినిమాను చేయబోతున్నాడు.



## నీలిరంగు చీరలో చందమామలా..నిధి అగర్వాల్

బ్యూటీ నిధి అగర్వాల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈబ్యూటీ సొంతం. మార్వాడి కుటుంబంలో జన్మించిన ఈ చిన్నది మోడలింగ్ చేసి, తద్వారా సినిమాల్లోకి అడుగుపెట్టింది.2017 లో మున్నా మైఖేల్ అనే హిందీ సినిమాతో నటిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ. తర్వాత అక్కినేని నాగచైతన్య నటించిన సవ్యసాచి అనే సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది.ఈ సినిమాలో నటించినప్పటికీ ఈ అమ్మడుకు అంతగా గుర్తింపు రాలేదు అనే చెప్పాలి.అయితే సవ్య సాచి సినిమా డిజాస్టర్ సొంతం చేసుకున్నప్పటికీ ఇప్పడు మాత్రం తన గ్లామర్‌తో ఆకట్టుకుందనే చెప్పాలి. దీని తర్వాత ఈ అమ్మడుకు తెలుగులో మంచి అవకాశాలే వచ్చాయి. ముఖ్యంగా పూరి జగన్నాథ్, రామ్ కాంబోలో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమాలో ఛాన్స్ లభించిందిఈ సినిమాతో ఈ బ్యూటీకి మంచి క్రేజ్ వచ్చింది. మూవీ కూడా హిట్ అవ్వడంతో తొలి హిట్ తన ఖాతాలో వేసుకొని, మంచి ఫేమ్ సొంతం చేసుకుంది. కానీ ఊహించిన విధంగా బెస్ట్ అవకాశాలు మాత్రం ఈ అమ్మడు సొంతం చేసుకోలేకపోయింది.ఇక ఈ చిన్నది రీసెంట్‌గా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హరి హర వీరమల్లు సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ, తాజాగా నీలి రంగు చీరలో అందంగా తయారైన ఫొటోస్ తన ఇన్ స్టాలో షేర్ చేసింది. ప్రస్తుతం ఇవి నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.





## మారువేశంలో కింగ్డమ్ సినిమా చూసిన రష్మిక..

ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న సినిమా కింగ్డమ్. విజయ్ దేవరకొండ హీరోగా డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన ఈ చిత్రానికి ఊహించని స్థాయిలో రెస్పాన్స్ వస్తుంది. ముఖ్యంగా మాస్ యాక్షన్ హీరోగా విజయ్ యాక్టింగ్ అదరగొట్టాడని సత్యదేవ్, విజయ్ మధ్య వచ్చే సీన్స్ గూస్ బంప్స్ అంటున్నారు ఫ్యాన్స్. ఇక ఈ సినిమాకు మరో హైలెట్ బీజీఎమ్. కథకు తగినట్లు అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ ఇరగదీశాడని ఇక గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్ అదిరిందంటూ కామెంట్స్ చేస్తున్నారు. టీజర్, ట్రైలర్ తో హైప్ క్రియేట్ చేసిన ఈ సినిమా విజయ్ కెరీర్ లోనే భారీ ఓపెనింగ్స్ సాధించి అదరగొట్టింది.అయితే కింగ్డమ్ సినిమా విడుదల సమయంలో నేషనల్ క్రష్ రష్మిక మందన్నా విజయ్ కు ఆల్ ది బెస్ట్ చెబుతూ ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. అలాగే సినిమా సూపర్ హిట్ టాక్ రావడంపై సైతం స్పందించింది. మొదటి నుంచి ఈ సినిమా కోసం ఎగ్జైటెడ్ గా ఉన్న రష్మిక.. అభిమానులతో కలిసి సినిమా చూడాలని అనుకుందట. హైదరాబాద్ ఫేమస్ సింగిల్ స్క్రీన్ లో ఆమె ఈ సినిమాను చూడాలనుకుందట.ముందుగా శ్రీరాములు థియేటర్ లో ఆమె ప్లాన్ చేసుకోగా.. సెక్యూరిటీ కారణాలతో ఆమె సినిమా చూసేందుకు నిర్వాహకులు ఒప్పుకోలేదట. దీంతో మరో సింగిల్ స్క్రీన్ థియేటర్ భ్రమరాంబ లో ఈ సినిమాను చూసిందట. అయితే చిత్రాన్ని నేరుగా కాకుండా మారువేశంలో వెళ్లి చూశారట. ఈ విషయాన్ని తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో నిర్మాత నాగవంశీ బయటపెట్టారు. ఇప్పుడు విషయం తెలియడంతో విజయ్, రష్మిక ఫ్యాన్స్ సర్ ప్రైజ్ గా ఫీల్ అవుతున్నారు.



## ఏది ఏమైన నేను అతన్నే పెళ్లి చేసుకుంటా..

20 ఏళ్లుగా దక్షిణాది సినీ పరిశ్రమలో తనదైన స్థానాన్ని సంపాదించుకున్న అగ్రహీరోయిన్ అనుష్క శెట్టి ఇప్పటికీ టాప్ లీగ్‌లో కొనసాగుతోంది. అనుష్క తర్వాత ఇండస్ట్రీలోకి వచ్చిన చాలా మంది హీరోయిన్‌లు ఇప్పటికే పెళ్లి చేసుకుని కుటుంబ జీవితంలోకి అడుగుపెట్టినప్పటికీ, స్వీటి మాత్రం తనకు నచ్చిన దారిలో సాగుతూ కెరీర్‌ను కొనసాగిస్తోంది. 2005లో నాగార్జున హీరోగా నటించిన 'సూపర్' సినిమా ద్వారా వెండితెరపై అరంగేట్రం చేసిన అనుష్క, తన అందంతో, అభినయంతో తక్కువ సమయంలోనే ప్రేక్షకులను ఆకట్టుకుంది. క్లాస్, మాస్ తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయింది. స్టార్ హీరోలందరితో కలిసి హిట్టైన సినిమాలు చేసింది. బాహుబలి' అనంతరం ఆమెకు పాన్-ఇండియా క్రేజ్ వచ్చింది. అదే సమయంలో సహనటుడు ప్రభాస్‌తో అనుష్క డేటింగ్‌లో ఉన్నారనే పుకార్లు మొదలయ్యాయి. వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని ఎన్నోసార్లు వార్తలు వచ్చాయి. కానీ ఈ విషయాలను అనుష్క, ప్రభాస్ ఇద్దరూ ఖండించారు. ఆ తరువాత ఓ ప్రముఖ వ్యాపారవేత్తతో కూడా అనుష్క పెళ్లి వార్తలు చక్కర్లు కొట్టాయి. అవి కూడా చివరికి వదంతులేనని తేలిపోయాయి. తాజా ఇంటర్వ్యూలో పెళ్లిపై క్లారిటీ ఇచ్చింది అనుష్క. ఈ అమ్మడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ  బాహుబలి విడుదలైన తర్వాత నాపై పెళ్లి ఒత్తిడి ఎక్కువైంది. కుటుంబ సభ్యులే కాదు, మీడియా నుంచి కూడా ఇదే ప్రశ్న వస్తోంది. నాకు పెళ్లిపై పూర్తి నమ్మకం ఉంది. సరైన వ్యక్తి, సరైన సమయం వచ్చినప్పుడు తప్పకుండా పెళ్లి చేసుకుంటా.ప్రేమ లేకుండా పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదు. నేను ప్రేమించే వ్యక్తినే వివాహం చేసుకుంటాను. నా తల్లిదండ్రులు ఈ విషయంలో నాకు మద్దతుగా ఉన్నారు అని చెప్పింది. సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తిని మాత్రం పెళ్లి చేసుకోను అని అనుష్క తేల్చి చెప్పడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దీంతో ఆమె భవిష్యత్తు జీవిత భాగస్వామి ఇండస్ట్రీ వ్యక్తి కాదనే క్లారిటీ వచ్చింది. కాగా, రవి తేజ, నాగార్జున, ప్రభాస్ వంటి స్టార్ హీరోలతో ఎన్నో హిట్ సినిమాలు చేసిన అనుష్క, ఇటీవల సినిమాలకు కాస్త బ్రేక్ తీసుకుంది. ఈ విరామం ఆమె వ్యక్తిగత జీవితంపై ఊహాగానాలకు దారితీసింది. ప్రస్తుతం ఆమె నటించిన 'ఘాటి' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఈ చిత్రంపై మంచి అంచనాలున్నాయి. విడుదల తేదీపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు.

Printed,Published by,Owened by **GADDAM NAGARAJU &** Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463 &** Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**